
కొత్తగూడెం విమానాశ్రయ స్థలానికి వెళ్లే రామవరం-గరీబ్‌పేట రహదారి

ఎయిర్‌పోర్టుపై నేడు అధ్యయనం

- కొత్తగూడెం, పాల్వంచలో పర్యటించనున్న కేంద్ర సర్వే బృందం
- రామవరం, గరీబ్‌పేట గ్రామాల మధ్య 950 ఎకరాల భూమి సిద్ధం

కొత్తగూడెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెం ప్రాంతంలోని రామవరం, గరీబ్‌పేట గ్రామాల మధ్య ఉన్న 950 ఎకరాల ప్రభుత్వ భూమిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఏఏఐ కేంద్ర సర్వే బృందం గురువారం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనుంది. స్థల పరిశీలన నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.38లక్షలు విడుదల చేసిన విషయం విదితమే. ఎయిర్‌పోర్టు కోసం కొత్తగూడెం ప్రాంతంలోని రామవరం-గరీబ్‌పేట గ్రామాల ప్రాంతాల్లో 950 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై సర్వే సభ్యులు పూర్తిస్థాయిలో పరిశీలించనున్నారు. కొత్తగూడెం ప్రాంతంలోనే కాకుండా పాల్వంచలో కూడా ఈ బృందం పర్యటించనున్నట్టు సమాచారం. అక్కడా భూమిని గుర్తించారు.

గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ఈ ప్రాంతం అనువైందా.. కాదా.. అనే కోణాల్లో సర్వే జరిపిన తర్వాత ఆ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టనుంది. ఈ బృందంలో ఏరోప్లానింగ్ ఇంజనీర్ అబ్దుల్ అజీజ్, ఆర్కిటెక్ట్ మహ్మద్ సకీబ్, ఆపరేషన్ ఇంజనీర్ ప్రశాంత్ గుప్త, సీఎన్ఎస్ ఆర్.దివాకర్, ఇంజనీర్ మనీష్ జోన్వర్, ఎఫ్‌డీఈ ప్రవీణ్ ఉన్నికృష్ణన్ వస్తున్నారు. ఇప్పటికే ఈ బృందం పర్యటనకు కావాల్సినటువంటి అన్ని ఏర్పాట్లను అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ బృందం కోరిన విధంగా రెవెన్యూ డిపార్టుమెంట్ భూసేకరణ, ఫారెస్ట్, వాటర్ రీసోర్సెస్, ఏవియేషన్ బృందాన్ని అందుబాటులో ఉంచేందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఏర్పాట్లు చేశారు. కాగా కేంద్ర బృందం చేపట్టే సర్వేకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల బుధవారం కలెక్టర్‌ను ఆదేశించారు.



జేఈఈ మెయిన్ షురూ

మొదటి రోజు 1,512 మంది హాజరు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఎన్.టి.ఏ. నిర్వహించే జేఈఈ మెయిన్, బీఆర్క్ మొదటి విడత పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 1542 మందికి 1512 మంది హాజరుకాగా, 30 మంది పరీక్షలకు హాజరుకాలేదని కో ఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు. విద్యార్థులు ఉదయం పరీక్షకు 8 గంటల నుంచి, మధ్యాహ్నం పరీక్షకు 2 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ముందస్తు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాలో 5పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాలుగా బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల, విజయ ఇంజనీరింగ్ కాలేజీ, ఎస్‌బీఐటీ పాకబండ బజార్, దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, (మిగతా 4వ పేజీలో)


చింతకాని మండలంలో రైతు భరోసాకు అనర్హులు చేశారని ప్రశ్నిస్తున్న బాధితులు

నిరసనలు.. ఆందోళనలు

- రెండో రోజు గ్రామసభల్లో మిశ్రమ సంఘటనలు
- జాబితాల్లో తమ పేర్లు లేవంటూ పలువురి గొడవ
- చింతకానిలో సెల్‌టవర్ ఎక్కిన యువకుడు
- గుండ్రాతిమడుగులో టెంట్ కూల్చివేత
- ఆత్కూరులో అనాథ బాలికకు ఇందిరమ్మ ఇల్లు
- పలు గ్రామసభలను సందర్శించిన కలెక్టర్

ఖమ్మం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో రెండోరోజైన బుధవారం కూడా పలుచోట్ల ఆందోళనలు, నిరసనలు చోటుచేసుకున్నాయి. రైతుభరోసా లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎక్కడా అభ్యంతరాలు లేకపోయినా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా విషయంలో తమ పేర్లు లేవంటూ కొందరు గ్రామసభల్లో నిరసనలు చేపట్టారు. మరికొన్నిచోట్ల ఆందోళనకు దిగారు. కొన్నిచోట్ల లబ్ధిదారుల ఆగ్రహం గమనించి వారికి కొందరు పరోక్ష మద్దతు తెలుపుతున్నారు. అయితే కొందరు అధికారులు చెప్పిన మాట విని తిరిగి దరఖాస్తులు అందిస్తున్నారు.

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఖమ్మం పట్టణంతోపాటు జిల్లాలో పలు గ్రామాల్లో పర్యటించారు. రైతుభరోసా విషయంలో లబ్ధిదారుల జాబితా వద్ద స్వల్పంగానే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల విషయంలో ఎక్కువచోట్ల నిరసనలు చోటు చేసుకుంటున్నాయి. జాబితాలో తమ పేర్లులేవని తెలుసుకుని ప్రజాపాలనలో మేం ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని నిలదీస్తున్నారు. భూములు, పెద్దభవనాలు ఉన్నవారు సైతం తమకు కార్డులు ఎందుకు ఇవ్వరని అధికారులను నిలదీస్తున్నారు. గ్రామసభల్లో జాబితాలు చూసి అనర్హుల విషయం బహిరంగంగానే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలిగిస్తున్నారు. కొన్నిచోట్ల సాఫీగా... కొన్నిచోట్ల ఆందోళనతో సభలు సాగుతున్నాయి. సత్తుపల్లి మండలం రేగళ్లపాడులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తమ పేర్లు లేవంటూ నిరసన వ్యక్తంచేశారు. కూసుమంచి గ్రామసభలో సైతం ఇందిరమ్మ ఇళ్లకు ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చినా తమ దరఖాస్తులు లేవని చెప్పడంతో అభ్యంతరం తెలిపారు. కొందరి దరఖాస్తులు పరిశీలన జరిపినా లబ్ధిదారులుగా పేర్లు లేకపోవడంతో ఆందోళనకు దిగారు. మండల అధికారి శ్రీలత జోక్యం చేసుకుని సాంకేతికంగా కొన్నిచోట్ల పొరపాట్లు జరిగాయని... అవసరమైతే రీ సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు చింతకాని మండలం లచ్చగూడెంలో 12 మంది రైతులు నిరసన వ్యక్తం చేశారు. రైతుభరోసాలో గతంలో ఇనాం పట్టాలకు రైతు బంధు ఇచ్చారని ఇప్పుడు తమపేర్లు తొలగించారంటూ రైతులు ఆందోళన చేశారు.

చింతకాని మండలంలోని నాగిలిగొండకు చెందిన పామర్తి శ్రీను 2008లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోగా ఆయన డబ్బులు అదే పేరుతో వున్న మరో వ్యక్తి ఖాతాలో జమ కాగా, ఇంతకాలం ఈ విషయం రహస్యంగా ఉంది. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో విషయం బటయపడింది. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇంటికోసం (మిగతా 6వ పేజీలో)

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ...
- జాబితాలో పేర్లు లేకుంటే దరఖాస్తు చేసుకోండి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


మూటాపురంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న చివరి లబ్ధిదారు వరకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో బుధవారం మంత్రి పొంగులేటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముటాపురంలో జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకే రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గతంలో జరిగిన ప్రజాపాలనలో దరఖాస్తులిచ్చి ఈ నెల 26 నుంచి అమలుకానున్న నాలుగు పథకాల్లో పేర్లు రాని వారు ఎవరూ అధైర్యపడాల్సిన పని లేదన్నారు. నాలుగు రోజులపాటు విడతల వారీగా గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకునే వారిలో అర్హులుంటే వెంటనే సంక్షేమ పథకాలను వర్తింప చేస్తామన్నారు.

కొంతమంది చేసే రెచ్చగొట్టే ప్రసంగాలను పట్టించుకోమని, చిత్తశుద్ధితో పని చేయటమే మా ప్రభుత్వానికి తెలుసన్నారు. అర్హత ఉన్న ప్రతీ వ్యక్తికి ఇందిరమ్మ రాజ్యంలో న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. మొదటిదశలో సొంత స్థలం ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లనిస్తామన్నారు. తర్వాత దశలో భూమి లేని అర్హత ఉన్నవారికి ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందుకే రూ.2లక్షల రుణాన్ని మాఫీ చేశామన్నారు. జనవరి 26 నుంచి వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసాను అందించనున్నట్టు మంత్రి చెప్పారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలను, మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను అందించనున్నట్టు మంత్రి చెప్పారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ, ముఝ్వా విజయబాబు, శాఖమూరి రమేష్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, గుడిమళ్ళ మధు, బొల్లినేని వెంకటేశ్వర్లు, యడవల్లి సైదులు, షేక్.ఖాజామియా, ఆరెకట్ల గురునాథం తదితరులు పాల్గొన్నారు.

చలి చంపేస్తోంది.. మంచు కప్పేస్తోంది...

రోజురోజుకు తగ్గిపోతున్న ఉష్ణోగ్రతలు 5



గణపేశ్వరాలయానికి మహర్దశ

- అభివృద్ధి పనులకు రూ.3.30 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- శుభద మండపం, కల్యాణమండపం, ఆర్చి నిర్మాణం

వివరాలు : 4లో


యాసిడ్ దాడికి పాల్పడిన యువకుడు గణేష్

తనను ప్రేమించాలంటూ...

- ఖమ్మంలో యువతిపై యాసిడ్ దాడి
- ఈనెల 13న ఇంటిముందు ముగ్గు వేస్తుండగా యువకుడి ఘాతుకం
- యువతికి స్వల్ప గాయాలు..
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

ఖమ్మం క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ యవకుడు ప్రేమ పేరుతో వేధిస్తూ... ఇంటిముందు ముగ్గు వేస్తున్న ఓ యువతిపై యాసిడ్ దాడికి పాల్పడిన ఘటన ఖమ్మం నగరంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ పరువు పోతుందని సదరు యువతి తల్లి ఈ విషయాన్ని గోప్యంగా ఉంచగా.. స్థానికుల ద్వారా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు బుధవారం ఖమ్మం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ కథనం ప్రకారం.. నగరంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన పేరబోయిన గణేష్ స్థానికంగా మండపం డెకరేషన్ పనులకు వెళుతుంటాడు. సమీప ప్రాంతానికి చెందిన యువతి నగరంలోని ఓ కాలేజీలో నర్సింగ్ సెకండియర్ చదువుతుండగా, గణేష్ కొంతకాలంగా ప్రేమపేరుతో (మిగతా 4వ పేజీలో)

అంకితభావంతో పని చేయండి...

- సర్కారు వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలి
- వైద్యులకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉద్బోధ
- జిల్లా జనరల్ ఆస్పత్రిలో తనిఖీ


జిల్లా ఆస్పత్రిలో కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 'ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు అంకితభావంతో సేవలు అందించాలి... సర్కారీ వైద్యంపై వారికి నమ్మకాన్ని కలిగించాలి...' అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, వెయిటింగ్ హాల్, ల్యాబ్, డయాగ్నస్టిక్ సెంటర్, దోబీ మిషనరీస్, ఎంపీహెచ్ డబ్ల్యూ ట్రైనింగ్ సెంటర్, మెడికల్ కళాశాల బాలుర వసతిగృహం, ఎంసీహెచ్, యునాని, ఆయుర్వేద వైద్యశాల, ఓపీ, మార్చురీ పక్కనున్న ఖాళీ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల సహాయకులతో మాట్లాడి, అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రభుత్వ దవాఖానకు (మిగతా 6వ పేజీలో)

ఉద్యోగాల పేరుతో మోసం

- చండీగఢ్‌లోని మొహాలీ కేంద్రంగా ముఠా
- తెలుగు యువతీ, యువకులే వారి టార్గెట్
- చైన్‌లింక్ సిస్టంతో డబ్బులు కట్టించకుంటే వేధింపులు
- ట్రైనింగ్ పేరుతో డబ్బుల వసూలు
- తట్టుకోలేక ఖమ్మం చేరుకున్న బాధితులు

ఖమ్మంక్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో సోషల్ మీడియాలో గాలం వేసి మోసాలకు పాల్పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. చండీగఢ్ రాష్ట్రంలోని మొహాలీ కేంద్రంగా బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ క్రియేషన్స్‌లో ఉద్యోగాల పేరుతో కొందరు అక్కడ ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల్లోని 17 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వయస్సు వారిని టార్గెట్ చేసి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఎరవేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులను చూసి తెలుగు రాష్ట్రాల నుంచి అక్కడకు వెళ్లిన యువతీ, యువకులు మోసపోయి తిరిగి వస్తున్నారు. ఉచితంగా జాబ్ ఇస్తామని చెప్పి అక్కడకు రప్పించిన తర్వాత ముందు ఐదు రోజుల ట్రైనింగ్ పేరుతో రూ.3వేలు తీసుకుంటున్నారు. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత రూ.70వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. డబ్బు చెల్లించలేని స్థితిలో ఉన్నవారిని తిరిగి పంపకుండా బెదిరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారి ఇబ్బందులు తట్టుకోలేక రూ.70 వేలు చెల్లించినా, చైన్‌లింక్ తరహాలో మళ్లీ ఐదుగురి చేత రూ.70వేలు కట్టించాలని డిమాండ్ చేస్తున్నారు. అలా ఐదుగురి చేత డబ్బు కట్టిస్తే ఒక్కొక్కరి నుంచి రూ.20వేలు కమీషన్‌గా చెల్లిస్తామని చెబుతున్నారు. 'అదేంటి నెలవారి వేతనం ఇస్తామని పిలిచారు కదా...' అని ఎవరైనా ప్రశ్నిస్తే వారిని కొట్టడం, బంధించడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి మోసంలో ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, విశాఖపట్నం, గుంటూరు జిల్లాకు చెందినవారు అనేకమంది ఇరుక్కున్నారు. వీరిలో కొంతమంది అక్కడినుంచి పారిపోయి బుధవారం రాత్రి ఖమ్మం చేరుకున్నారు. ఇక్కడినుంచి వారు పోలీసుల కు సమాచారం అందించడంతో సురక్షితంగా ఇంటికి చేరుకున్నారు.

అక్కడ జరిగేదంతా మోసం



మల్లు మధులత, వైరా

ఖమ్మం జిల్లాలో ఓ గురుకులంలో పనిచేస్తుండగా చండీగఢ్‌లో వేలల్లో జీతం ఇస్తారని నా స్టూడెంట్ ఒకరు చెప్పిన మాటలు నమ్మి ఈ నెల 15న మొహాలికి వెళ్లాను. నేను వెళ్లిన రైలులోనే సుమారు 200మంది తెలుగు రాష్ట్రాల యువతీ యువకులు వచ్చారు. అక్కడికి వెళ్లిన తరువాత మూడురోజుల్లోనే అక్కడున్నవారు పలు విషయాలు చెప్పడంతో ఆందోళనతో తిరిగి ఖమ్మం వచ్చా. అక్కడ రోజూ వందల కోట్లల్లో మోసాలు జరుగుతున్నాయి. వారినుంచి తప్పించుకుని వచ్చినా నా వివరాలు వారి వద్ద ఉండడంతో రోజూ ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. వారి బృందానికి సంబంధించి నిజామాబాద్‌కు చెందిన భాస్కర్, విఘ్నేష్, అశోక్ ఫోన్‌చేసి అక్కడ జరిగేది బయట కు చెబితే గొంతు కోసేస్తామని, ఏ జిల్లాలో ఉన్నా కంపెనీ మనుషులు, గంజాయి బృందాలు ఉంటాయని, వారితో చంపిస్తామని బెదిరిస్తున్నా రు. అక్కడి దందా గురించి జిల్లా పోలీసులకు సమాచారం అందించా.


ఖమ్మం చేరుకున్న బాధితులు

రెండోరోజూ గందరగోళం

- కొర్లగూడెంలో ఆర్డీవో కారు అడ్డగింత
- కూసుమంచిలో నేలపై బైఠాయించి నిరసన
- ఖమ్మంరూరల్‌లో అధికారులను నిలదీసిన ప్రజలు
- అర్హులకు పథకాలు అందలేదని గ్రామసభల్లో ఆగ్రహం

కల్లూరు/ఖమ్మంరూరల్/కూసుమంచి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హులకు ప్రభుత్వ పథకాలైన రైతురుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్లు అందలేదని వాటిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరుతూ కొర్లగూడెం గ్రామంలో బుధవారం జరిగిన గ్రామసభలో స్థానిక ప్రజలు, పలువురు రైతులు ఆర్డీవో రాజేంద్రగౌడ్ కారును అడ్డగించి ప్రశ్నించారు. కొర్లగూడెం గ్రామసభ ప్రారంభం కాగా పర్యవేక్షణ నిమిత్తం ఆర్డీవో అక్కడకు వెళ్లారు. అదే సమయంలో గమనించిన స్థానికులు రూ.2లక్షలకుపైగా రైతు రుణమాఫీ అందకపోవటంపై నిరసన వ్యక్తం చేశారు. మండలస్థాయిలో అధికారులు ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన జాబితాను చదివి వినిపించారు. దీంతో అర్హతలేని వారి పేరు జాబితాలో వచ్చాయని గ్రామసభలో అధికారులపై పలువురు తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న రైతు రుణమాఫీ తమ గ్రామంలో అర్హులైన పలువురు రైతులకు అందలేదని దీనిపై స్పష్టత ఇవ్వాలని గ్రామసభ నుంచి కారులో వెళ్తున్న ఆర్డీవోను రైతులు అడ్డగించారు. కొర్లగూడెంలో ఒకే కుటుంబంలో ముగ్గురికి ఇందిమ్మ ఇల్లు ఎలా మంజూరయ్యాయని స్థానికులు గ్రామసభలో అధికారులపై మండిపడ్డారు. ఈ సభకు వచ్చిన ఆర్డీవో రాజేంద్రగౌడ్ వివరణ ఇస్తూ రైతు రుణమాఫీ అనేది ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. గ్రామసభలో తెలిపిన జాబితాలో ఏవైన లోపాలు జరిగితే వాటిపై పరిశీలన చేసి తదుపరి చర్యలు తీసుకోవటం జరుగుతుందని చెప్పటంతో స్థానికులు శాంతించారు. మండల పరిధిలో పలు గ్రామాల్లో జరిగిన సభల్లో ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, ఎంపిఓ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

భూస్వాములకు పథకాలు ఏంటని ప్రశ్నించిన ప్రజలు

భూ స్వాములకు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమేనా ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం అంటూ గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. ఖమ్మంరూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం, కాచిరాజుగూడెం, పొన్నేకల్లు, ఆరెకోడు తండా, కొండాపురం, గొల్లగూడెం, ఆరెంపుల, పోలిశెట్టిగూడెం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో జాబితాల్లో ఉన్న పేర్లు చదువుతుండగా భూస్వాములకు, అనర్హులకు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారికి మాత్రమే లిస్టులో పేర్లు రావడం ఏమిటని అధికారులను నిలదీశారు. అనర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దసంఖ్యలో భూములు ఉన్నవారికి, ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారి కుటుంబాల వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. దీంతో రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ కలగజేసుకుని ప్రజలతో మాట్లాడారు. లిస్టులో పేర్లు ఉండి వారు ధనికులైతే వారి పేర్లు తొలగించడం జరుగుతుందని, పేర్లు రాని వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో ప్రజలు శాంతించారు. జాబితాలో పేర్లు రాని వారు సభ వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్ద దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్, ఆర్ఐలు ప్రసాద్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.


కూసుమంచిలో కిందకూర్చుని నిరసన తెలుపుతున్న దృశ్యం


ఎం వెంకటాయపాలెంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

కూసుమంచిలో నేలపై బైఠాయించి నిరసన

ప్రభుత్వ పథకాలలో అర్హులను ఎంపిక చేసేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభల్లో రెండోరోజు అదే పరిస్థితి కనిపించింది. అర్హులను వదిలి.. అనర్హులను ఎంపిక చేయడంతో బుధవారం అధికారులను గ్రామస్థులు తీవ్ర స్థాయిలో నిలదీశారు. కూసుమంచి గ్రామసభలో అధికారుల తీరుకు ప్రజలు కిందకూర్చుని నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు ఉపేందర్‌రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు నలగాటి నాగయ్య, అర్వపల్లి ఉపేందర్, నెల్లూరి రవి తదితరులు సభ ఆద్యంతం కిందకూర్చుని నిరసన వ్యక్తం చేశారు. అర్హులను ఇప్పుడే ఇక్కడే ఎంపిక చేయాలని రాజకీయాలకు తావులేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా రేషన్‌కార్డులకోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇవ్వలేదని ఇప్పుడు అనర్హులకు మాత్రం వెంటనే మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లపథకంలోనూ అవకతవకలు జరిగాయని పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాలేరులోనూ నిరసన వ్యక్తమైంది. జీళ్లచెరువు, నాయకన్‌గూడెం, గోరీలపాడుతండ, పోచారం, చేగొమ్మ గ్రామాల్లో పెద్దఎత్తున ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి..

సెల్‌టవర్ ఎక్కి డిమాండ్ చేసిన వ్యక్తి



చింతకాని, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామానికి చెందిన పామర్తి శ్రీనివాసరావు బుధవారం గ్రామంలో ఓ ప్రైవేటు సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఈనెల 9వ తేదీన అదే సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపిన శ్రీను బుధవారం సాయంత్రం 3 గంటల సమయంలో మరోసారి సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. 2008లో తన పేరిట వచ్చిన ఇందిరమ్మ ఇల్లు అధికారుల తప్పిదం వల్ల మరో వ్యక్తికి మంజూరైందని, తాను నష్టపోయానన్నాడు. నేడు గ్రామంలో నిర్వహించే గ్రామసభలో తన పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాడు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు ఎంత నచ్చజెప్పిన శ్రీను వినకుండా రాత్రి సమయంలో కూడా టవర్‌పైనే కూర్చుని నిరసన తెలిపాడు.

గణపేశ్వరాలయానికి మహర్దశ

- అభివృద్ధి పనులకు రూ.3.30 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- శుభద మండపం, కల్యాణమండపం, ఆర్చి నిర్మాణం





కూసుమంచి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కూసుమంచి గ్రామం సందర్శిస్తే ప్రతి ఒక్కరికీ మరిచిపోలేని అనుభూతి కలుగుతుంది. గ్రామం చివరలో గల గణపేశ్వరాలయంలో కాకతీయుల ప్రాచీన శిల్పకళానైపుణ్యం.. ఆధ్యాత్మిక శోభ.. ప్రశాంత వాతావరణం.. ఒక మరిచిపోలేని అనుభూతినిస్తుంది. ఈ ఆలయ అభివృద్ధికి రూ.3.30 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గణపేశ్వరాలయం నిర్మాణంలో కాకతీయులకు గల నైపుణ్యం వారి శిల్పకళా చాతుర్యాన్ని కొనియాడే విధంగా నిర్మించారు. వాస్తు పద్ధతులను, సంప్రదాయ పద్ధతులను అనుసరిస్తూనే స్థానిక సాంప్రదాయ శైలికి తమ అభిరుచులను జోడించారు. ఉత్తర, దక్షిణ, తూర్పు ద్వారాలను పెద్ద పెద్ద రాతిమెట్లతో నిర్మించి మధ్య 12 అడుగుల వృత్తాకారంలో కల్యాణ మండపాన్ని నిర్మించారు. దేవాలయ నిర్మాణాన్ని రెండు రాతి వరుసల్లో నిర్మించారు. వెలుపల గోడ శిల్పుల నైపుణ్యాన్ని, గణపతి దేవుని ప్రాశస్త్యాన్ని కొనియాడే విధంగా నగిశీలు చెక్కబడి ఉన్నాయి. లోపలి గోడ మూడు రాళ్లతో 15 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పుతో గల రాతిదిమ్మెలను పేర్చి నిర్మించారు. గర్భాలయం పైకప్పు మీద చక్రాన్ని చిత్రించడం ఒక ప్రత్యేకత. గర్భాలయంలోని ఈశ్వరునికి పైభాగంలో అష్టకోణాలతో ఈ చక్రం కనిపిస్తుంది. క్రేన్లు, ప్రొక్లెయిన్లు లేని ఆ కాలంలో ఇంతపెద్ద రాళ్లను ఎలా తరలించారు. వాటిని ఒక వరుసలో సులభంగా, సున్నితంగా, ఖచ్చితంగా ఎలా పేర్చారు అనేది ఆశ్చర్యం కలిగిస్తుంది. గణపేశ్వరాలయంలో శివలింగాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. మూలవిరాట్టుగా ఉన్న ఈ శివలింగం నిర్మాణంలో చాలా ప్రత్యేకతలున్నాయి. ఇది 12అడుగుల ఎత్తు 6.3 అడుగుల కైవారంతో ఏకశిలా రూపంలా నిర్మించారు. దీనికింద మూడు అడుగుల విస్తీర్ణంతో పానవట్టం నిర్మించారు. దీనిని నల్లగ్రానైట్ రాయి లేదా నల్లసేనపు రాతితో నిర్మించారు.

రూ.3.30 కోట్ల నిధులు

గణపేశ్వరాలయంలో రూ.3.30కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. గతేడాది సెప్టెంబరు 23 తేదీన దేవాదాయశాఖ స్థపతి గణేష్ ఆధ్వర్యంలో పరిశీలించి ప్రతిపాదనలు రూపొందించారు. రూ.1.25కోట్లతో శుభద మండపం, దేవతామూర్తుల కల్యాణంకోసం రూ.26 లక్షలతో మండపం, రూ.1.41 కోట్లతో ప్రాకారం, రూ.8.50లక్షలతో పాకశాల, రూ.14.50లక్షలతో ఆర్చి గేటు నిర్మించనున్నారు. కార్యాలయ నిర్వహణకు రూ.15.50 లక్షలతో నిర్మించనున్నారు.

ఫిబ్రవరి 15నాటికి అందుబాటులోకి

మద్దులపల్లి మార్కెట్

- మంత్రుల ఆదేశాలతో శరవేగంగా పనులు
- రూ.37కోట్లతో అప్రోచ్ రోడ్లకు ప్రతిపాదనలు
- మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు

ఖమ్మం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 15లోపు మద్దులపల్లి మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు తెలిపారు. మండల పరిధిలోని మద్దులపల్లి మార్కెట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల ఆదేశాలతో శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఖమ్మం పట్టణంలోని మార్కెట్‌ను ఆధునీకరణ చేస్తుండటంతో రైతులకు మద్దులపల్లి మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎన్నెస్పీ భూమిపై ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని ఆ భూమిని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో మార్కెట్‌కు అప్పగించనున్నట్టు తెలిపారు. మార్కెట్ ప్రారంభోత్సవంతోపాటు కార్యకలాపాలు కొనసాగడంలో కావాల్సిన మెకానిజంపై మార్కెట్ పాలకవర్గం ఆధ్వర్యంలో తీర్మానం చేసినట్టు తెలిపారు. మద్దులపల్లి మెయిన్ రోడ్డు నుంచి, గొల్లగూడెం నుంచి, ఆటోనగర్ నుంచి మార్కెట్ వరకు 100 అడుగుల వెడల్పుతో డివైడర్‌తో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. అందుకు అవసరమైన రూ.37 కోట్ల నిధులకోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్టు తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ తేజావత్ పంతులు నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సురేష్, వెంకటనారాయణ, సుధాకర్, సురేష్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు

క్రమశిక్షణతో లక్ష్యాలు సాధ్యం

సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు

చుంచుపల్లి, జనవరి22(ఆంధ్రజ్యోతి): లక్ష్యాలు సాధించాలంటే క్రమ శిక్షణ తప్పని సరని కొత్తగూడెం సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు అన్నారు. బుధవారం రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రీడలు - 2025లను ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ జీవితంలో ఎదగాలి, విజయం సాధించాలి అంటే క్రమ శిక్షణ ఎంతో అవసరమన్నారు. అధ్యాపకులు , పెద్దలను గౌరవించాలని సూచించారు. విద్యార్థులు క్రీడల ఆడటం వలన మానసిక , శారీరక ధృడత్వానికి దోహదపడతాయని ఆకాంక్షించారు. చదువుకునే చదువుల్లో ఏకాగ్రతకు ఈ క్రీడలు సహకరిస్తాయని , దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఆటలు ఆడం ద్వారా నాయకత్వ లక్షణాలు, లక్ష్యసాధన లాంటివి పెంపొందుతాయని తెలిపారు. క్రీడలు గెలుపు , ఓటముల గురించి కాదు,అవి నేర్పించే అనుభవాలు , పోరాట స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ పోటీల్లో ఆరు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కోటి రెడ్డి, మణుగూరు , రుద్రంపూర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు నాగముని నాయక్, బండి శ్రీనివాస్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులంపేరుతో దూషించిన ఘటనలో 13మందిపై కేసు

పాల్వంచ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన ఘటనలో 13 మందిపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన ఆసోజు ప్రవీణ్ ఈ నెల 19న స్థానికంగా ఉండే చికెన్ సెంటర్‌కు వెళ్లాడు. రాత్రి సమయంలో చికెన్ సెంటర్ త్వరగా మూసివేయడంతో తిరిగి ఇంటికి చేరుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో బ్రిడ్జి సమీపంలో స్నేహితులు కలవడంతో వారితో మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన పానుగంటి లక్ష్మీనారాయణ అటుగా వెళుతూ వారితో అకారణంగా వాగ్విదానికి దిగాడు. అంతటితో ఆగకుండా రాత్రి సమయంలో ఇక్కడ మీకేమిటి పని అని వారిని కులం పేరుతో దూషించాడు.

వారు లక్ష్మీనారాయణకు తిరిగి గట్టిగా జవాబు చెప్పడంతో అసహనానికి లోనైన లక్ష్మీనారాయణ తిరిగి ఊరిలోకి వెళ్లి తన స్నేహితులైన మరో 12 మందితో కలిసి అక్కడకు చేరుకుని ప్రవీణ్, అతని స్నేహితులను దుర్భాషలాడుతూ వారి పై భౌతిక దాడి పాల్పడటమే కాకుండా చంపుతామని బెదిరించాడు. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు 13 మందిపై అట్రాసిటీ కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ రాములు తెలిపారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దమ్మపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుర్వాయిగూడెం గ్రామానికి చెందిన కుంజా పోతురాజు (38) దమ్మపేటకు వచ్చి సరుకులు కొనుగోలు చేసి తిరిగి గుర్వాయిగూడెం వెళ్లే క్రమంలో పశువైద్యశాల సమీపంలో రోడ్డుపై వెళుతుండగా అశ్వారావుపేట మండలం నారంవారగూడెం గ్రామానికి చెందిన కంచర్ల నాగపుల్లారావు ద్విచక్రవాహనంతో వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈఘటనలో పోతురాజుకు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి సోదరుడు పాపారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన లచ్చాపురం గ్రామంలో బుధవారం జరిగింది. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లచ్చాపురం గ్రామానికి చెందిన మక్కెళ్ల శివ (32) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపధ్యంలో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకును ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బుచ్చిరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీట్ ఆఫీసర్ దుర్మరణం


సాంబశివరావు (ఫైల్)

మణుగూరు/ మణుగూరు రూరల్ జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలం బీటీపీఎస్ వద్ద బుధవారం రాత్రి 11గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడూళ్లబయ్యారం రేంజ్ పరిధికి చెందిన సాంబశివరావు(45) మృతిచెందాడు. వివరాలు ఇలాఉన్నాయి.. మణుగూరు మండలం దమ్మకపేట గ్రామంలో ఉంటున్న బీట్ ఆఫీసర్ సాంబశివరావు పినపాక మండలం బోటిగూడెం గ్రామంలో విధులు ముగించుకొని వస్తుండగా బీటీపీఎస్ వద్ద వెనుకనుంచి వస్తున్న డీసీఎం వ్యాను ఢీ కొట్టడంతో స్థానికు లు మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సాంబశివ రావును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. దీంతో మణుగూరు రేంజ్ అధికారులు మృతుని స్వగ్రామమైన పాల్వంచ తరలించేందుకు ఏర్పాటుచేస్తున్నారు. డీసీఎం డ్రైవర్ మద్యం మత్తులో ఉండి అతివేగంగా వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జేఈఈ మెయిన్ షురూ

(3వ పేజీ తరువాయి)

ప్రియదదర్శిని ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్షకు 112 మందికి 110 మంది, మధ్యాహ్నం పరీక్షకు 112 మందికి 112 మంది, దరిపల్లిలో ఉదయం 160 మందికి 156, మధ్యాహ్నం 160 మందికి 155, బొమ్మలో ఉదయం 119 మందికి 117, మధ్యాహ్నం 120 మందికి 118, ప్రియదర్శినిలో ఉదయం 140 మందికి 138, మధ్యాహ్నం 139 మందికి 137, ఎస్‌బీఐటీలో ఉదయం 240 మందికి 232, మధ్యాహ్నం 240 మందికి 237 మంది పరీక్షకు హాజరైనట్టు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్ల శిక్షణ కేంద్రం ధ్వంసం

- పామేడు అడవుల్లో గుర్తించిన కోబ్రా బలగాలు
- బీజాపూర్ జిల్లాలో 8 ఐఈడీలు స్వాధీనం
- గరియాబంద్ ఎన్‌కౌంటర్‌లో 18కి చేరిన మృతుల సంఖ్య


పామేడు అడవుల్లో కోబ్రా బలగాలు గుర్తించిన మావోయిస్టు శిక్షణ కేంద్రం


చర్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బట్టిగూడెం గ్రామంలో మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న శిక్షణ కేంద్రాన్ని కోబ్రా బలగాలు బుధవారం ధ్వంసం చేశాయి. నక్సల్స్ గత కొన్ని సంవత్సరాలుగా పామేడు అడవుల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. బట్టిగూడెం గ్రామంలో భారీ స్థూపం ఏర్పాటు చేశారు. దానికి ఆనుకుని సుమారు 10ఎకరాల విస్తీర్ణంలో మైదానం తయారు చేశారు. మధ్యలో పూరిపాకలు నిర్మించారు. అక్కడ నక్సల్స్‌కు ప్రతీరోజు శిక్షణ ఇస్తారని తెలుస్తోంది. అలాగే ఈ నిర్మాణం చుట్టూ కాపలా కోసం సెంట్రీలకు కర్రలతో ఎత్తయిన కట్టడాలు కూడా నిర్మించారు. అది పూర్తిగా దండకారణ్యం కావడంతో ఇప్పటివరకు అక్కడకు ఎవ్వరూ అక్కడికి వెళ్లలేకపోయారు. కొర్‌గట్టు గ్రామంలో బలగాలు పోలీస్ క్యాంపు ఏర్పాటు చేయడంతో కోబ్రా బలగాలు అక్కడికి చేరుకున్నాయి. అక్కడ ఉన్న స్థూపం, గుడిసెలను జవాన్లు కూల్చివేశారు.

ఇక బీజాపూర్ జిల్లాలో కేంద్ర బలగాలు 8 ఐఈడీ మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేశాయి. జిల్లాలోని ముద్వెండి గ్రామం నుంచి పిడియా గ్రామం వరకు బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో కాలిబాటలో బలగాలే లక్ష్యంగా నక్సల్స్ ఏర్పాటు చేసిన 8 ఐఈడీ మందుపాతర్లను గుర్తించారు. అనంతరం వాటిని నిర్వీర్యం చేశారు. ఒక్కో మందుపాతర 5 కేజీలు ఉంటుందని బలగాలు తెలిపాయి.

అలాగే గరియాబంద్ ఎన్‌కౌంటర్‌లో జరిగిన ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్న బలగాలకు బుధవారం మరో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. దాంతో ఈ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య 18కి పెరిగింది. మృతి చెందినవారిని గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

అప్పటి ఫొటో.. ఇప్పుడు వైరల్..

2016కు ముందు భార్యతో ఫొటో దిగిన చలపతి ● దాని ద్వారానే గుర్తించిన పోలీసులు


చలపతి, ఆయన భార్య అరుణ

చర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి అలియాస్ అప్పారావు, అలియాస్ జయరాం రెడ్డి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబంద్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భార్య అరుణతో కలిసి చలపతి దిగిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది. కొన్ని తప్పుడు కథనాలు కూడా వస్తున్నాయి. చాలా మంది ఆ ఫొటో చూసి తెగ ఆరాలు తీస్తున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి, ఆయన భార్య అరుణ మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న రోజుల్లో 2016 సంవత్సరానికి ముందు ఇద్దరు ఒక సెల్ఫీ ఫొటో దిగారు. ఆ ఫొటో నేడు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది. 2016 మే నెలలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో చెరుకూరు రాజకుమార్ అనే నక్సలైట్ మృతి చెందాడు. ఇదే క్రమంలో ఆయన లాప్‌టాప్‌లో ఈ ఫొటో పోలీసులకు దొరికింది. అప్పటి దాకా చలపతి, ఆయన భార్య బాహ్య ప్రపంచానికి తెలియదు. అప్పటి నుంచి ఈ ఫొటో ఆధారంగా బలగాలు ఆయన కోసం గాలిస్తున్నాయి. కాగా ఈ ఫొటో ఆధారంగా లొకేషన్ గుర్తించి గరయాబంద్ అడవుల్లో చలపతి ఎన్‌కౌంటర్ జరిగిందనే ఫేక్ న్యూస్ ఒకటి మీడియాతో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

తనను ప్రేమించాలంటూ..

(3వ పేజీ తరువాయి)

ఆమెను వేధిస్తున్నాడు. యువతి పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోని గణేష్ వేధింపులు కొనసాగిస్తూనే ఉన్నాడు. దీంతో యువతి ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో ఇటీవలే అతడిని యువతి తల్లి మందలించింది. ఈ క్రమంలో సంక్రాంతి సందర్భంగా గత 13న రాత్రి సమయంలో యువతి తన ఇంటిముందు ముగ్గు వేస్తుండగా గణేష్ బైక్‌పై వచ్చి తనను ఎందుకు ప్రేమించట్లేదని బాటిల్‌లోని యాసిడ్ తీసి యువతిపై చల్లాడు. దీంతో సదరు యువతి కేకలు వేసింది. స్థానికులు వచ్చేలోపే గణేష్ పరారయ్యాడు. యువతికి పొట్ట, చేయిభాగంలో యాసిడ్ పడి గాయాలు కావడంతో కుటుంబసభ్యులు వెంటనే నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానేఉన్నా.. గణేష్ నుంచి తనకు ప్రాణహాని బాధిత యువతి ఆందోళన వ్యక్తం చేస్తోంది. యువతి తండ్రి గతంలో మృతిచెందగా తల్లి ఓ పాఠశాలలో ఆయాగా పనిచేస్తూ కూతురు, కుమారుడిని చదివిస్తోంది. ఈ విషయం బయటకు తెలిస్తే పరువుపోతుందని పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే స్థానికుల ద్వారా విషయం బయటకు వచ్చి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు విచారణ చేశారు. దీంతో బాధిత యువతి తల్లి మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి, గణేష్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో వివాదం!

కొత్తగూడెం వ్యక్తికి కేటాయించారని గాంధీభవన్‌లో పరస్పర దాడులు

చుంచుపల్లి, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల వ్యవహారం తారా స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో జరిగిన ఈ ఎన్నికల్లో గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులను కాదని గత బీఆర్ఎస్ పార్టీలో పని చేసిన నాయకులకు పదవులు కట్టబెట్టారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ ప్రాంతానికి చెందిన జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 40 ఏళ్ల వయస్సు కలిగిన ఓ నాయకుడు పోటీ చేసి ఎన్నికవ్వడం వివాదాస్పదమైంది అదేవిధంగా రాష్ట్ర, జిల్లా కమిటీలలో అనర్హులచే వివిధ హోదాల్లో పోటీ చేయించి ఎన్నిక చేసేలా ప్రోత్సహించారని తెలుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ గాంధీభవన్ నిర్వహిస్తున్న ఎగ్జిక్యూటీవ్ కమిటీకి హాజరైన యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌ను నిలదీసేందుకు నాయకులు వెళ్లడం ఈ రగడకు దారి తీసింది. పరస్పరం రెండు వర్గాల మధ్య దాడులు జరిగాయి. వివిధ హోదాల్లో పోటీ చేసిన అనర్హుల ఎన్నికను తక్షణమే రద్దు చేయాలని నిరసన, నినాదాలు యూత్ కాంగ్రెస్ నాయకులు చేశారు. ఈ సంఘటన భద్రాద్రి జిల్లా సోషల్ మీడియాలో వైరల్ అవడంతో చర్చనీయాంశమైంది.

సమస్యలు ఉంటే చెప్పండి..

న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ భానుమతి ● సదనాలు, వృద్ధాశ్రమాల పరిశీలన

మణుగూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మణుగూరు డివిజన్‌లోని మణుగూరు అశ్వాపురం మండలాల్లోని వృద్ధాశ్రమాలను బాలల సదనాలను, బాల వెలుగు పాఠశాలను బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జీ భానుమతి పరిశీలించారు. తొలుత అశ్వాపురంలోని సీతారామపురం వద్ద గల మానవీయ వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి వృద్ధులతో మాట్లాడారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే తెలపాలని సూచించారు. అనంతరం హారీఫారోష్మి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. పాతిక మంది వృద్ధులు ఈ ఆశ్రమంలో ఉండగా వారి యోగక్షేమాలను కనుక్కొన్నారు. న్యాయపర సమస్యలు ఉంటే తెలపాలని వాటిని పరిష్కరించేందుకు ఓ న్యాయవాది దావా వేసి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. మణుగూరు మండలంలోని శివలింగాపురం గ్రామంలోని బాలల సదనం చేరుకుని అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. తర్వాత సంతోష్ నగర్‌లోని బాల వెలుగు విద్యాభ్యాస పాఠశాలను పరిశీలించారు. స్థానిక సింగరేణి సేవా సమితిసభ్యులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలిపారు. నిర్వాహకుడు జగన్మోహన్‌రెడ్డి 28 ఏళ్ల నుంచి ఇక్కడ బాలవెలుగు పాఠశాలను నిర్వహి స్తూ 1500 మంది విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పించడం పట్ల అభినందనలు తెలిపారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా న్యాయవాది నిరంజన్ రావు, మణుగూరు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంకం సర్వేశ్వరరావు, కుర్మా విజయరావు, షేక్ షాహిన్, బాడిస భిక్షం, ముత్తదరపు జానకీరామ్, గుండెబోయిన రామకృష్ణ పాల్గొన్నారు.

మంచు కప్పేస్తోంది

చలి చంపేస్తోంది..

- తగ్గిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఇళ్లల్లోంచి బయటకు రాలేకపోతున్న జనం
- కూలీలకు చలిమంటలతో ఉపశమనం


మంచు దుప్పటిలో భద్రాచలం రామాలయం


ముదిగొండలో ఖమ్మం-కోదాడ రోడ్డుపై పొగ మంచు

కొత్తగూడెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత మూడు రోజుల నుంచి పొగమంచు పెరిగిపోయింది. చలితీవ్రత అధికమైంది. సాయంత్రం 6గంటలు కాగానే ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. తెల్లవారుఝామున 4గంటల నుంచే పొగమంచు విపరీతంగా పట్టడంతో రోడ్లమీద వెళ్లే పలు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చలితీవ్రంగా ఉండటం వల్ల ఉదయం 8గంటలు అవుతున్నప్పటికీ సూర్యుడు రాకపోవడం ఎండావేడిమి లేకపోవడం విపరీతంగా మంచు కురవడంతో ఇంట్లో నుంచి బయటకు జనం రాలేకపోతున్నారు. వృద్ధులు, పిల్లలు ఆందోళనకు గురవుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గి చలితీవ్రత పెరగడం వల్ల జలుబు తదితర అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. అటవీ ప్రాంతాలైన చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, పినపాక, మణుగూరు, కరకగూడెం, అశ్వాపురం, ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి, పాల్వంచ, కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, అశ్వారావుపేట తదితర మండలాలను మంచు దుప్పటి కప్పేసింది. సాయంత్రం సమయంలో 10 నుంచి 14డిగ్రీల ఉష్ణోగ్రత మాత్రమే నమోదు అవుతున్నాయి. ఉదయం సమయంలో కూడా 10నుంచి 12డిగ్రీల్లోపు మాత్రమే ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. ఆ తర్వాత 10గంటల తర్వాత సూర్యుడు వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరిగి 20నుంచి 25డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మొత్తం మీద విపరీతంగా చలి ఉండటం వల్ల మిర్చి, వరి, పత్తికోతలకు వెళ్లే కూలీలకు, రైతులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. కూలీలు మిర్చితోటల దగ్గర రాత్రి సమయంలో బస చేయడం వల్ల ఆ ప్రాంతంలో చలితీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల రాత్రి సమయంలో చలిమంటలు వేసుకుని కాగుతున్నారు. మొత్తం మీద సంక్రాంతి పండుగ ముందే చలి తీవ్ర తక్కువగా ఉన్నప్పటికి పండుగ తర్వాత మారిన వాతావరణం మూలంగా చలి ప్రభావం మరింతగా పెరిగి ప్రజలను పలు ఇబ్బందులకు గురి చేస్తోంది.

భద్రాచలంలో..

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం బుధవారం పొగమంచుతో దర్శనమిచ్చింది. ఉదయం 9 గంటలైనా రామాలయం, మిథిలా స్టేడియం పరిసరాలు పొగమంచుతో దర్శనమిచ్చాయి. దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో ఎదురుగా ఏమున్నది సైతం సరిగా కనిపించని పరిస్థితి నెలకొంది.


జూలూరుపాడులో చలిమంట కాగుతున్న యువకులు

ఎస్‌జీఎఫ్ అండర్- 17 రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ పోటీల ప్రారంభం


మాట్లాడుతున్న డీఈవో సోమశేఖరశర్మ

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీలు బుధవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైనాయి. పోటీలను డీఈవో సోమశేఖరశర్మ క్రీడకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. చిన్నతనం నుంచే క్రీడలను నేర్చుకోవాలని అన్నారు. ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు, మానసిక పరిపక్వత పెరుగుతుందని అన్నారు. నగరంలో మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క నిజామాబాద్ జిల్లా జట్టు మినహా పాత తొమ్మిది జిల్లాల నుంచి సుమారు 140 మంది క్రీడాకారులు హాజరైనారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు నర్సింహమూర్తి, నరేష్, అబ్బర్వర్ గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఏకలవ్య'లో ప్రవేశానికి దరఖాస్తులు

దుమ్ముగూడెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజేందర్‌సింగ్ బుధవారం తెలిపారు. బాలురకు 30, బాలికలకు 30 సీట్లుండగా, ఎస్టీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఇతర కులాలకు చెందిన వారైతే దత్తత పిల్లలు, అనాథ పిల్లలు, ప్రభుత్వ భవనాలకు స్థలాలను దానంగా ఇచ్చిన సర్టిఫికెట్లను పరిగణలోనికి తీసుకుంటామన్నారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 16వ తేదీలోగా మీసేవ, అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వీరి తీరు మారదా ?

- అనధికారికంగా కాటేజీ అద్దెకిచ్చిన ఉద్యోగి
- సీనియర్ ఉద్యోగుల అండతో రామాలయంలో మారని కొందరి వైఖరి

భద్రాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పని చేసే కొందరు ఉద్యోగుల వ్యవహార తీరు ఇంకా మారకపోవడం పట్ల సర్వత్ర ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. రాముడంటే భక్తి లేదు.. అధికారులంటే భయం లేదు అనే రీతిగా దేవస్థానంలో పని చేస్తున్న పలువురు వ్యవహరిస్తున్నారు. ఆర్జిత టికెట్ల, ప్రచార శాఖలో సామగ్రి విక్రయాలకు వచ్చిన డబ్బును సొంతానికి వాడుకోవడం గతంలో చోటు చేసుకుంది. దేవస్థానం ఈవో సత్రాలు, కాటేజీలు భక్తులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినా కొందరు సిబ్బంది అందులోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఈనెల ఆరంభంలో ముక్కోటి ముందు ఒక భక్తుడు ఆన్‌లైన్‌లో కాటేజీని బుక్ చేసుకోగా అత్యవసర కారణాలతో తాను రాలేకపోతున్నట్లు దేవస్థానం సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో రంగనాయకుల గుట్టపై పని చేస్తున్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆ కాటేజీని ఎవరికి చెప్పకుండా అద్దెకిచ్చి అందుకు సంబంధించిన మొత్తాన్ని తానే తీసుకున్నట్లు వినికిడి. అయితే అంతా సవ్యంగా జరిగిందనుకుంటున్న తరుణంలో అందులో బస చేసిన భక్తులు తమకు చెందిన కీలక వస్తువులు మరిచిపోవడంతో వారు దేవస్థానంను సంప్రదించినట్లు తెలుస్తోంది. దీంతో విచారణ చేయగా అసలు విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

దీంతో సదరు ఉద్యోగి నుంచి దేవస్థానం అధికారులు వివరణ కోరగా అది తన తప్పిదమేనని లిఖితపూర్వకంగా ఇచ్చినట్లు దేవస్థానం వర్గాల్లో ప్రచారం సాగుతోంది. సదరు ఉద్యోగి గతంలో పర్ణశాలలో హుండీ లెక్కింపు సమయంలో సైతం చేతివాటాన్ని ప్రదర్శించినట్లు సమాచారం.


ప్రసంగిస్తున్న పీవో రాహుల్

పర్యావరణంపై అవగాహన అవసరం

- ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్నతనం నుంచే పర్యావరణంపై అవగాహన అవసరమని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాలలో జిల్లాలో ఎంపిక చేసిన 50 పాఠశాలల బాలికల విద్యార్థులకు సబ్బులు, హ్యాండ్‌వాష్ లిక్విడ్, డిష్‌వాష్ లిక్విడ్ ఎలా తయారు చేయవచ్చు అనే అంశంపై వర్కుషాపు నిర్వహించారు. పీవో రాహుల్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రకృతిపరంగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. చెత్తను వేరు చేయడంలో పాఠశాలలు, గృహాల్లోనూ చేయవలసిన అంశాల గురించి వివరించారు. వర్కుషాపులో నేర్చుకున్న అంశాలన్ని కూడా తమ పాఠశాలల్లోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నేర్పించాలని సూచించారు. అనంతరం జిల్లా సైన్సు అధికారి చలపతిరాజు మాట్లాడుతూ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీసీ ఏసీవో రాజశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ మనమ్మ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వీరునాయక్, ఎంఈవో టి.రమ, ఏటీడబ్ల్యువో రమణయ్య పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

- ఆయిల్‌ఫెడ్ అధికారుల నిర్ణయం


రేగళ్లపాడు నర్సరీలో పామాయిల్ మొక్కలు

సత్తుపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం రేగళ్లపాడులోని ఆయిల్‌పామ్ నర్సరీలో మొక్కల పెంపకంలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతున్న విషయం విదితమే. విచారణ పూర్తి అయ్యేవరకు రేగళ్లపాడు నర్సరీ ఇన్‌చార్జి పృథ్వీలాల్, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణారావులను బాధ్యతల నుంచి తొలగించారు. వీరిద్దరూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు. రేగళ్లపాడు నర్సరీలో మూడు లక్షల ఆయిల్‌పామ్ మొక్కలను పెంచారు. నర్సరీలో మొక్కల సంఖ్యలో తేడాలు ఉండటంతో అధికారులు విచారణ ప్రారంభించారు. మొక్కలు నాణ్యత లోపంతో పెరుగుతున్న కారణంగా 80వేల మొక్కలను ధ్వంసం చేసినట్లు కొందరు చెబుతుండగా మొక్కలు పక్కదారి పట్టాయని మరికొందరు ఆరోపిస్తున్నారు. విచారణ జరుగుతున్న క్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విచారణ పూర్తి అయ్యేవరకు బాధ్యతల నుంచి తొలగించినట్లు తెలిసింది.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

అవగాహన కల్పించిన రవాణా శాఖ

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వాహనదారులు కచ్చితంగా రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి, సురక్షత ప్రయాణం చేయాలని ఖమ్మం రవాణాశాఖ అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ స్వర్ణలత కోరారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలు కూడళ్లలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. బైక్‌లు హెల్మెట్లు, కార్లు, భారీ వాహనదారులు సీటు బెల్ట్ పెట్టుకొని వాహనాలను నడపాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం రవాణాచట్టం మేరకు నేరంగా ప్రకటించారు. ఆటో డ్రైవర్లు నిర్ణీత సమయానికి వాహనాల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, లైసెన్స్ రెన్యూవల్స్ చేయించుకోవాలని సూచించారు.

యూరియా కొరత ఉంటే సహించేది లేదు

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


రాష్ట్ర వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఖమ్మం జిల్లా ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

వైరా, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో యూరియా కొరత ఉంటే సహించేది లేదని రైతులు క్యూలో ఉండాల్సిన పరిస్థితి రావొద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం జిల్లా ఫెర్టిలైజర్ అసోసియేషన్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలను కలిసి జిల్లాలో యూరియా ఇబ్బందులపై వినతిపత్రం సమర్పించారు. వెంటనే మంత్రి తుమ్మల యూరియా సమస్యను జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. మార్క్‌ఫెడ్ నుంచి కూడా ప్రైవేట్ డీలర్లకు యూరియా సరఫరా చేయాలని, మీ వద్దనే యూరియా గడ్డకట్టిపోతే ఏంచేస్తారని అన్నారు. ఇప్పటికే రామగుండం నుంచి ఎన్‌ఎఫ్‌ఎల్ యూరియా, మిర్యాలగూడెం నుంచి ఇఫ్కో, కృష్ణపట్నం బోర్డు నుంచి కోరమండల్ యూరియా లారీలు ఖమ్మం జిల్లాకు వస్తాయని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆతర్వాత రాష్ట్ర వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ కె.విజయ్‌కుమార్‌ను ఈ ప్రతినిధులు కలిసి యూరియా సమస్యపై వినతిపత్రం సమర్పించారు. మార్క్‌ఫెడ్ నుంచి అలాగే కంపెనీల నుంచి తమకు యూరియా సరఫరా చేయాలని కోరగా అదనపు డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సత్వరమే యూరి యా కేటాయింపులు చేశారు. ఇఫ్కో యూరియా 730మెట్రిక్ టన్నులు, రామగుండం ఎన్‌ఎఫ్‌ఎల్ నుంచి 579మెట్రిక్ టన్నులు, కోరమండల్ యూరియా కృష్ణపట్నం నుంచి 730టన్నులు ఇవి కాకుండా మరో రెండువేల మెట్రిక్ టన్నుల యూరియాను ఖమ్మంజిల్లాకు కేటాయించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కూడా వివిధ కంపెనీల నుంచి 1,450మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారు. అసోసియేషన్ ప్రతినిధులు బోడేపూడి నాగేశ్వరరావు, సీహెచ్.ప్రభాకర్‌చౌదరి, పాసంగులపాటి లక్ష్మీనారాయణ, చెన్నా సుధీర్, యలమందల నగేష్, మేడూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరిహద్దుల వద్ద నిఘా పటిష్ఠం

- ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో అప్రమత్తమైన భద్రాద్రి జిల్లా పోలీసు యంత్రాంగం
- పలు చోట్ల చెక్‌పోస్టుల ఏర్పాటు


సరిహద్దులోని అడవులను తనిఖీ చేస్తున్న బలగాలు

కొత్తగూడెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల జరుగుతున్న ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. 2025 జనవరి నెలలో వరుసగా మూడు భారీ ఎన్‌కౌంటర్లు జరగడంతో ఒక్కసారిగా జిల్లా పోలీసు యంత్రాంగం జిల్లా సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మవోయిస్టులు ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న మావోయిస్టులు తెలంగాణ ప్రాంతంలో తలదాచుకునేందుకు వస్తారనే ఆలోచనతో జిల్లాకు చెందిన పోలీసులు ఎన్‌కౌంటర్ జరిగినప్పుడల్లా అప్రమత్తమవుతున్నారు. సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేసి అయా ప్రాంతాల్లో అడవులను సైతం జిల్లా పోలీసులు సాయుధ బలగాలు కూంబింగ్‌ను సైతం నిర్వహిస్తున్నారు. ప్రతి వాహనదారులను సైతం తనిఖీలు చేస్తూ అనుమానం వచ్చిన వారిని ప్రశ్నిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా మధ్యప్రదేశ్‌ప్రాంతాల నుంచి పలు వాహనాల్లో జిల్లాలోని మిర్చికోతల కోసం కూలీలు విపరీతంగా ఈ కాలంలో వస్తుంటారు. అలాంటి వాహనాలను సైతం జిల్లా పోలీసు యంత్రాంగం గస్తీ ఏర్పాటు చేసి అయా వాహనాలను సైతం తనిఖీలు నిర్వహించి అనుమానితుల ను ప్రశ్నిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఛత్తీస్‌గఢ్‌కు సంబంధించిన మావోయిస్టులు తెలంగాణ ప్రాంతంలోని సరిహద్దుల్లోకి రాకుండా నిఘాను ఏర్పాటు చేశారు.

ఈ నెల 20, 21 తేదీన ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా సరిహద్దులోని గరియాబంద్ వద్ద జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో సుమారు 18మంది వరకు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 1000మంది జవాన్లు పాల్గొని, డ్రోన్లతో మావోయిస్టుల కదలికలను గుర్తిస్తున్నారు. సుమారు 40గంటలకుపైగా కాల్పులు కొనసాగాయి. ఆ తర్వాత కూడా కాల్పులు కొనసాగడంతో మావోయిస్టులకు సంబంధించిన వారు తెలంగాణ ప్రాంతానికి ప్రాణాలను రక్షించుకునేందుకు ఈ ప్రాంతాల్లో తలదాల్చుకునేందుకు వస్తారనే ఆలోచనతో భద్రాద్రి జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.

చర్ల, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం, పినపాక, ఏడూళ్ల బయ్యారం, భద్రాచలం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఆ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు క్షుణ్ణంగా చేస్తున్నారు. 650క్యాంపులతో ఛత్తీస్‌గఢ్‌లో సాయుధ బలగాలు నిఘాను ఏర్పాటు చేశారు. ఆపరేషన్ కదార్‌తో సాయుధ బలగాలదే మావోయిస్టులపై పైచేయి అయింది. సుమారు ఈ ఏడాది వ్యవధిలో 300మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. ఈ నెల 5వ తేదీన బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా 15వతేదీన బీమారంపాడు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12మంది మావోయిస్టులు తాజాగా గరియాబంద్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 16మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇదే ఎన్‌కౌంటర్‌లో మరో రెండు మృతదేహాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. 2026 మార్చిలోగా ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం లేకుండా చేస్తామని ఒక పక్కన కేంద్ర హోంమంత్రి అమీత్ షా తేల్చి చెప్పడంతో ఈ ఏడాది ఏదో ఒక రోజు మావోయిస్టులు-పోలీసుల మధ్య ఎన్‌కౌంటర్ జరుగుతున్న నేపథ్యంలో అత్యధికంగా మావోయిస్టు పార్టీకి చెందిన వారే కోల్పోయారు. ఎలాగైన తెలంగాణ ప్రాంతంలో తలదాల్చుకోవాలనే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచే తెలంగాణ రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గాలు ఉన్న నేపథ్యంలో పెద్ద ఎత్తున నిఘాపెట్టింది.

గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, జనవరి22(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత మూటాపురం గ్రామంలో రూ.20.40లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంఖుస్థాపన చేసిన అనంతరం రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేసారు. పైనంపల్లిలో రూ.20లక్షలు, అప్పలనర్సింహాపురంలో 30లక్షలు, కట్టుకాచారంలో రూ.20లక్షలు, కోరట్లగూడెంలో రూ15లక్షలు, కోనాయిగూడెంలో రూ.20లక్షలు, కొంగరలో రూ.15లక్షలు, బుద్దారం గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు మంత్రి శంఖుస్థాపనలు చేసారు. గ్రామాల్లో దాదాపు అన్ని రోడ్లు సీసీ రోడ్లుగా చేసామన్నారు. ఇంకా ఎక్కడైనా మిగిలితే వాటిని సైతం సీసీ రోడ్లుగా వేస్తామన్నారు. కార్యక్రమంలో ఆరెకట్ల గురవయ్య, ఆరెకట్ల కొండలరావు, చిట్టూరి అచ్చయ్య, వెన్నపూసల సీతారాములు, బచ్చలకూరి నాగరాజు, గుడిమళ్ళ మధు, యడవల్లి సైదులు, యడవల్లి నాగరాజు, ఎనికె జానకిరామయ్య, జంగం లక్ష్మీనారాయణ, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.


బుద్దారంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

నేటితో ముగియనున్న విలాసోత్సవాలు

- దసరా మండపంలో రామయ్యకు విలాసోత్సవం


రామయ్యకు విలాసోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విలాసోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. మంగళవారం విలాసోత్సవాలు ప్రారంభం కాగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. రెండో రోజున శ్రీ సీతారామచంద్రస్వామికి దసరా మండపంలో విలాసోత్సవం నిర్వహించారు. స్వామి వారిని అందంగా అలంకరించిన పల్లకిలో మేళతాళాలు, భాజభజంత్రీలు, భక్తుల కోలాటాల నడుమ దసరా మండపంకు తీసుకొచ్చి వేదికపై ఆసీనులను చేశారు. అనంతరం విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ విలాసోత్సవాన్ని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా కన్వీనరు డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, ఎస్ఎన్‌వి రామారావు. డాక్టర్ సుబ్బరాజు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, పట్టణ ప్రముఖులు, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం తీసుకెళ్లారని... మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


రమేష్(ఫైల్)

ఇల్లెందురూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీ వాళ్ల తన ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లారని మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం గ్రామంలో చోటు చేసుకుంది.

కుటుంబ సభ్యులు, గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన ఈసం రమేష్ (35) కూలీ పనులు చేస్తు జీవిస్తుంటాడు. ఖమ్మం పట్టణంలో ఓ ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీ ద్వారా ద్విచక్ర వాహనం కొనుగోలు చేశాడు. సరైన సమయంలో డబ్బులు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ద్విచక్ర వాహనాన్ని మూడు రోజుల క్రితం తీసుకెళ్లారు. దీంతో తీవ్ర మానస్తాపానికి గురైన రమేష్ సోమవారం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఇల్లెందు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమం గా ఉండడంతో మహబుబాబాద్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన్య ప్రాణులకు హాని చేస్తే చర్యలు

- ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మొహిద్దీన్


సీసీ కెమెరాలో చిక్కిన వేటగాళ్లు

కరకగూడెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అటవీ సంచరిస్తున్న వన్య ప్రాణులకు హాని కల్పించిన, వేటాడిన కఠిన చర్యలు తప్పవని మణుగూరు డివిజన్ అటవీ శాఖ ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మొహిద్దీన్ హెచ్చరించారు. బుధవారం కరకగూడెం మండలంలోని అటవీ ప్రాంతంలో ఇటీవల పెద్దపులి సంచారంతో పెద్దపులి గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు చిక్కిన వేటగాళ్ల ఆనవాళ్లను గుర్తించి ఫొటోలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో ఎఫ్‌డీవో మాట్లాడుతూ.. అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న వన్య ప్రాణులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని తెలిపారు. వన్య ప్రాణులను వేటతో కానీ, హాని చేయడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాక అటవీ సంపదనను ధ్వంసం చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అడసర్లపాడుకు డీసీసీబీ బ్రాంచ్ మంజూరు

- మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు

ఖమ్మం వ్యవసాయం, జనవరి22 (ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేంసూరు మండల పర్యటనలో భాగంగా అక్కడ రైతులు అడసర్లపాడులో నూతనంగా డీసీసీబీ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేయవలసినదిగా మంత్రిని కోరారు. వారి అభ్యర్థన మేరకు డీసీసీబీ ఖమ్మం వారిని ఆర్బీఐకి సమాచారం పంపించవలసినదిగా ఆదేశించారు. వారి ఆదేశాల ప్రకారం బ్యాంక్ పాలకవర్గ సమావేశంలో తీర్మానించి అభ్యర్థనను పంపారు. తదుపరి నాబార్డ్ ఆర్బీఐలతో మంత్రి తుమ్మల సంప్రదించి, అడసర్లపాడు గ్రామంలో నూతనంగా డీసీసీబీ బ్యాంకు బ్రాంచ్ మంజూరు చేయుటకు కృషి చేశారు. బ్రాంచ్ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి తుమ్మలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావుధన్యవాదాలు తెలిపారు.



స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకాల కింద రుణాల కోసం దివ్యాంగులు ఫిబ్రవరి 2వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఖమ్మం జిల్లాకు రూ. 50వేల విలువ గల 24 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జిల్లాలోని ప్రతి మండలం, కార్పోరేషన్‌కు ఒక యూనిట్‌గా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 24 యూనిట్లను మంజూరు చేసిందని తెలిపారు. 40 శాతం అంగవైకల్యం ఉండి, 21 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు, గ్రామీణ ప్రాంతంలో రూ. లక్షా యాభైవేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల ఆదాయం ఉన్న వారు అర్హులని తెలిపారు.

నిరసనలు... ఆందోళనలు...

(3వ పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకున్న శ్రీనుకు ఈవిషయం తెలియడంతో గ్రామంలో పంచాయతీ పెట్టాడు. దీంతో గ్రామంలో అందరు ఆ శ్రీనివాస్ పేరుమీద ఇందిరమ్మ ఇల్లు తీసుకుని నీకు డబ్బులు ఇప్పిస్తామని తెలిపారు. అయితే తనకు న్యాయం జరగుగుతుందో లేదోనన్న ఆందోళనతో గురువారం గ్రామసభ ఉన్న నేపథ్యంలో బుధవారం సెల్‌టవర్ ఎక్కాడు.

తల్లిదండ్రులు లేని బాలికకు మానవతా దృక్పదంతో ఇల్లు కేటాయించారు. మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన బాలిక ఒకరు తల్లిదండ్రులు చనిపోవడంతో అమ్మమ్మవద్ద ఉంటున్నది. అమ్మమ్మ కూడా వృద్ధాప్యంతో పాటు అనారోగ్యంతో ఉన్నందున బాలిక దీనస్థితి చూసి ఆమె పేరును ఇందిరమ్మ ఇల్లు జాబితాలో చేర్చారు. అధికారులు మానవతా దృక్పదంతో కేటాయించగా, సోషల్‌మీడియాలో కొందరు ట్రోల్‌చేయడంతో ఆ ఇల్లు రద్దుచేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఇందిరమ్మ లబ్దిదారుల జాబితాలో పేర్లు లేకపోవడంతో కాంగ్రెస్‌లోని రెండువర్గాల కార్యకర్తలు కొట్టుకున్నారు. కావాలని చేశారంటూ జాబితాలో పేర్లులేని వారు ఆగ్రహంచి వేదిక పక్కన ఉన్న మరో వర్గం నాయకులపై దాడికి దిగారు.దీంతో పోలీసులు సర్దిచెప్పారు.

కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగులో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు , ఇందిరమ్మ ఆత్మీయభరోసాలో పేర్లులేవని కొందరు దరఖాస్తుదారులు నిరసనకు దిగారు. గ్రామసభ నిర్వాహణ కోసం అధికారులువేసిన టెంటు పడేశారు. దీంతో అధికారులు తిరిగి దరఖాస్తులు ఇవ్వాలని కోరడంతో నిరసనదారులు శాంతించి దరఖాస్తులు అందించారు. పడిపోయిన టెంటు మరలా వేసి గ్రామసభనిర్వహించారు.

నిరంతరాయంగా సంక్షేమం

- మేయర్ పునుకొల్లు నీరజ
- ప్రజాపాలన డివిజన్ సభలకు స్పందన
- పర్యవేక్షించిన కమిషనర్ అభిషేక్

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్దిదారులకు నిరంతరాయంగా కొనసాగుతాయని, ఎవరూ ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని నగర మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 21 నుంచి 41వ డివిజన్ వరకు ప్రజాపాలన డివిజన్ బహిరంగ సభలను కార్పొరేటర్లు, కేఎంసీ ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండో రోజు ప్రజల నుంచి అనూహ్యంగా స్పందన కనిపించింది. ప్రతీ డివిజన్ సభలోను ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జాబితాలను అధికారులు చదివి వినిపించారు. సభలు జరిగిన ప్రాంతంలో గోడలకు అంటించారు. కొన్ని డివిజన్లలో వాట్సాప్ గ్రూపులకు పంపటంతో లబ్దిదారులు తమ సెల్‌ఫోన్‌లో పేర్లు పరిశీలించుకున్నారు.

ఈ సందర్భంగా 26వ డివిజన్ బహిరంగ సభలో మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ వ్యవసాయ



మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఖమ్మం జిల్లా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయన్నారు. దశల వారీగా సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. సంక్షేమ పథకాలకు అర్హత ఉండి జాబితాలో పేర్లు రాని వారు ఉంటే ఖమ్మం నగర పాలక సంస్థలోని హెల్ప్ డెస్క్‌లో వినతి పత్రం ఇవ్వాలని సూచించారు. కమిషనర్ అభిషేక్ ఆగస్త్య 22 డివిజన్ సభల రికార్డులను పరిశీలించారు. డివిజన్ సభలో దరఖాస్తులు ఇవ్వలేని వారు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. కేఎంసీ అధికారులు వసుందర, బెల్లం రాధిక, జి. శ్రీనివాసరావు, శివలింగం, సాంబయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది

ఒక్కో డివిజన్ సభకు ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి రూ. 20వేలు నిధులు కేటాయించి కాంట్రాక్టర్‌కు డివిజన్ సభలో సౌకర్యాలను కల్పించాలని అగ్రిమెంట్ చేశారు. ప్రతి సభలో గుడారం, రెండు టెంట్లు, 150 కుర్చీలు, 8కూల్ వాటర్ క్యాన్‌లు, 7బల్లాలు, సౌండ్ సిస్టమ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని పనులు అప్పగించారు. అయితే కొన్ని సభలో నిబంధనల మేరకు కూల్ వాటర్ క్యాన్‌లు, కూర్చిలు కూడా ఏర్పాటు చేయలేదు. వందల సంఖ్యలో ప్రజలు గంటల తరబడి నిల్చోనే సభల్లో పాల్గొన్నారు. కాంట్రాక్టర్లకు అనుకూలంగా ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు వ్యవహరించారనే ఆరోపణలు వ్యాపించాయి.



27వ డివిజన్‌లో మంత్రుల చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంత్రుల చిత్రపటానికి పాలతో అభిషేకం

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని 27 డివిజన్‌లో బుధవారం జరిగిన గ్రామసభలో 1,180 దరఖాస్తులను పరిశీలించి 820 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రజలు యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బెజ్జం బాలగంగాధర్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు.

గ్రామసభల్లో గందరగోళం

రఘునాథపాలెం/ తిరుమలాయపాలెం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన గ్రామ సభలు మండలంలో గందరగోళంగా జరిగాయి. రఘునాథపాలెం, చిమ్మపూడి, రాంక్యాతండాలో గ్రామ సభలు ఇందిరమ్మ ఇళ్ల జాబితా ప్రదర్శన సందర్భంగా సభకు వచ్చిన ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆన్‌లైన్ జరిగిన ఇళ్ల జాబితాలను చదువుతున్నారని ప్రజలు సభలను అడ్డగించారు. పదేకరాలు ఉన్న వారికి, రెండు ఇళ్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు ఏలా మంజూరు చేశారని అధికారులను నిలదీశారు. తిరుమలాయపాలెం మండలంలో జల్లేపల్లి, పడమటితండా, హైదరసాయిపేట, బీరోలలు మేడిదపల్లి, ఎర్రగడ్డ, కొక్కిరేణి, కేశవాపురం, మేకలతండా, ఏనుకుంటతండా, జూపెడ, హస్నాబాద్‌లో జరిగిన గ్రామసభల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో తమ పేర్లులేవని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జల్లేపల్లిలో అధికారపార్టీ వారికి చెందిన వారికే సంక్షేమపథకాలు ఎక్కువగా వచ్చాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరన్న ఆధ్వర్యంలో అధికారులను నిలదీశారు.



రఘునాథపాలెంలో గ్రామసభ

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- స్టాల్స్ ఏర్పాటుకు ఆదేశం
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్. పి. శ్రీజతో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జాతీయజెండా ఎగురవేస్తారని అన్నారు. ఉదయం 9.00 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా జరిగే జిల్లా స్థాయి వేడుకలో జాతీయ సమైక్యతను తెలియజేస్తూ మూడు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గణతంత్ర వేడుకల వేదిక, సీటింగ్ ఏర్పాట్లు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా చేయాలని ఖమ్మం అర్బన్ తహసిల్దార్‌ను ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. నూతన పథకాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నమూనాను స్టాల్‌లో ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహిళా శక్తి స్టాల్‌ను గ్రామీణ అభివృద్ధి అధికారి సిద్ధం చేయాలని అన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బంది ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి రాఘవరావు తెలిపారు. మంత్రి ఉదయం 9:30కి బయల్దేరి 10గంటలకు తిరుమలాయపాలెం మండలం కేశవాపురం గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. 10:30కి తిప్పారెడ్డిగూడెంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. 11గంటలకు జల్లెపల్లి గ్రామంలో సీసీరోడ్లకు, 11:30కి హైదరసాయిపేట గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12గంటలకు పెదమటితండా గ్రామంలో సీసీ రోడ్లకు, జోగులపాడు గ్రామంలోనూ గ్రామపంచాయతీ భవనానికి, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 1గంటకు చంద్రుతండా గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. 1:30కి మహ్మదాపురం గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మహ్మదాపురం నుంచి 5:30కి హైదరాబాద్ వెళతారు.

పలు కుటుంబాలకు తాతా మధు పరామర్శ

తిరుమలాయపాలెం, జనవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతిచెందిన పలు మృతుల కుటుంబాల సభ్యులను బుధవారం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పరామర్శించారు. పాపాయిగూడెంలో రోడ్డుప్రమాదంలో మృతిచెందిన రేపాకుల వెంకన్న కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసినివాళులర్పించారు. అనంతరం శొంటి వెంకమ్మ కుటుంబాన్ని కూడా పరామర్శించారు. పిండిప్రోలులో పరికపల్లి బుచ్చిరాములు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ను పరామర్శించారు ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పి.వెంకటేశ్వర్లు, చామకూరి రాజు, చంద్రశేఖర్ , రవి, పాల్గొన్నారు.

26న కబడ్డీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్ జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో ఫిబ్రవరి 1 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టును ఈనెల 26న నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలోఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు తుంబూరు దయాకర్‌రెడ్డి, కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 85కిలోల లోపు బరువు ఉండాలని, ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

10వ డివిజన్‌లో ప్రత్యేక పారిశుధ్య పనులు



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని పదో డివిజన్‌లో ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పదో డివిజన్‌లో అపరిశుభ్రత' కథనంపై కమిషనర్ అభిషేక్ ఆగస్త్య స్పందించారు. డివిజన్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్యను ఆదేశించారు. దీంతో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టి రహదారులు, డ్రెయినేజీలను శుభ్రం చేశారు. క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు జరుగుతాయని కేఎంసీ వర్గాలు ప్రకటించాయి.

సస్యరక్షణ చర్యలతోనే మిర్చిలో నల్ల తామర నివారణ

- కొండలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు

కూసుమంచి/ తిరుమలాయపాలెం/ ఖమ్మం అగ్రికల్చర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సస్యరక్షణ చర్యలతోనే మిర్చిలో నల్లి, నల్లతామర, కాయకుళ్లు తెగులు నివారించవచ్చని కొండలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉద్యాన పరిశోధనాస్థానం కొండమల్లేపల్లి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రాజా గౌడ్, జేవీఆర్ ఉద్యాన పరిశోధనాస్థానం నాగరాజు, పాలేరు ఉద్యాన అధికారి అపర్ణ తదితరులు బుధవారం కూసుమంచి మండలం చేగొమ్మ, తిరుమలాయపాలెం మండలం పిండిపోలు గ్రామాల్లో మిర్చితోటలను పరిశీలించారు. మిర్చికి ఆశిస్తున్న నల్లతామర, ఎర్రనల్లి పురుగు, కాయకుళ్ల తెగుళ్లను గుర్తించారు. రైతులకు తగిన సూచనలు చేశారు.

రైతుబజార్‌లకు 'వీధి' పోటు

- రోడ్ల వెంబడి దుకాణాలతో బేజారు
- పట్టించుకోవాలని రైతులు, వ్యాపారుల వినతి



మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు, వ్యాపారులు

ఖమ్మంమార్కెట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు సరసమైన ధరలకు తాజా కూరగాయలను, మాంసాహారాన్ని ఒకే చోట అందించాలన్న ఉద్దేశ్యంతో కోట్లాది రూపాయల ప్రజా ధనంతో నగరంలో రోల్ మోడల్‌గా నిర్మించిన రెండు సమీకృత మార్కెట్(సర్కారీ రైతుబజార్)లు వీధి వ్యాపారుల కారణంగా వ్యాపారాలు డీలా చెందినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ల వెంబడి ఇబ్బడి ముబ్బడిగా ప్రైవేటు వీధి వ్యాపారులు కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడంతో రైతుబజార్‌లకు వినియోగదారులు రాక వ్యాపారాలు సరిగ్గా సాగట్లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సదరు రైతు మార్కెట్‌లలో వ్యాపారాలు సజావుగా సాగితే ప్రభుత్వానికి సైతం అద్దెల రూపంలో కూడా ఆదాయం భారీగా వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఆయా మోడల్ మార్కెట్లను అద్దెల వసూళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారే తప్ప ఆయా మార్కెట్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవట్లేదని విమర్శలు సైతం వస్తున్నాయి.

వీధి వ్యాపారులతోనే సమస్యంతా

నగరంలో రోడ్ల వెంబడి వీధి వ్యాపారాలు చేసే వ్యాపారులతోనే అసలు సమస్య ఉత్పన్నమవుతుందని, వారిని కట్టడి చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఆయా వీధి వ్యాపారులతో ట్రాఫిక్ సమస్యలు సైతం ఎదురవుతున్నాయని నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉండే రోడ్ల వెంబడి కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో అక్కడ ప్రమాదాలు సైతం ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. రోడ్ల వెంబడి ఉన్న వీధి వ్యాపారుల దుకాణాలు మూసి వేసి వారికి రైతుబజార్‌లో దుకాణాలు కేటాయించాలని రైతులు, వ్యాపారులు బుధవారం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతి పత్రాన్ని అందజేశారు.

'ప్రత్యామ్నాయ సాంస్కృతికోద్యమం బలోపేతం కావాలి'



'నింగి నిండా ఎర్రజెండా' ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ సాంస్కృతికోద్యమం మరింత బలోపేతం కావాలని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. ప్రముఖ కవి కటుకోజ్వల ఆనందచారి రచించిన నింగినిండా ఎర్రజెండా ఆడియో సీడీ ఆవిష్కరణ బుధవారం ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో ఘనంగా జరిగింది. సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా రూపొందించిన ప్రచార గీతాల సీడీని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రజా నాట్యమండలి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కె.దేవేంద్ర తదితరులతో కలిసి ప్రముఖ కవి విద్యావేత్త రవి మారుత్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు నామా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వామపక్ష ఉద్యమాలు గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు పోయేందుకు ప్రయత్నాలు విన్నూత్నంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కవులు రౌతు రవి, కన్నెగంటి వెంకటయ్య, కటుకోజ్వల రమేష్, సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, మాదినేని రమేష్ , కళ్యాణం వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానందం పాటల రచయత కటుకోజ్వల ఆనందచారి, సంగీత దర్శకుడు ఐలూ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ

పోలీస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మంక్రైం, జనవరి22(ఆంధ్రజ్యోతి): పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్‌ను సీపీ సునీల్‌దత్ బుధవారం పోలీసుకమిషనర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ సునీల్‌దత్ మాట్లాడారు. పోలీసుసిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు తనవంతుగా కృషిచేస్తానన్నారు. వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఏసోబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి ఎం.వెంకటేశ్వర్లు, జానిమియా, మోహన్‌రావు పాల్గొన్నారు.



మేయర్ కుటుంబ సభ్యులతో హర్మేజడ్

మేయర్‌తో గోద్రెజ్ అధినేత భేటీ

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజతో గోద్రెజ్ కంపెనీ అధినేత హర్మేజడ్ గోద్రెజ్ భేటి అయ్యారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఖమ్మంలోని మేయర్ నివాసానికి వెళ్లారు. మేయర్‌తో కొద్ది సేపు మాట్లాడి తెనేటి విందు స్వీకరించారు.

అంకితభావంతో పని చేయండి

(3వ పేజీ తరువాయి)

వచ్చే వాహనాల పార్కింగ్, హాస్పిటల్ ప్రధాన గేట్, బయట వాహనాల రద్దీ నియంత్రణ, ప్రధాన మార్గం ఆర్చీ నిర్మాణాలపై కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆస్పత్రికి కావాల్సిన వైద్య పరికరాలు, సౌకర్యాల గురించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. రోగులకు అందించే భోజనం రుచికరంగా, పౌష్టికాహారంతో అందించాలని ఆయన అధికారులకు సూచించారు. టూ వీలర్ పార్కింగ్ నిర్వహణపై పరిశీలించారు. పార్కింగ్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

విభాగాలు తెలిసేలా బోర్డులు..

ఆస్పత్రికి వచ్చిన రోగుల వైద్యం కోసం వెతుకులాడకుండా ఏ విభాగం ఎక్కడ ఉంటుందో తెలిసేలా ప్రత్యేకంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. టాయిలెట్ మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. ఆస్పత్రిలోని క్రిటికల్ కేర్ భవనం వైపు, పరిపాలన భవనం వైపున సీసీ రోడ్లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రిలోని ప్రధాన ద్వారం వద్ద రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏ విభాగం ఎక్కడుందని విషయంపై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి రోగుల సహాయకులకు తెలపాలని అన్నారు. ఆస్పత్రికి 10 ఏసీలు, రేడియాలజీ పోస్టులు వెంటనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రి నుంచి మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.కిరణ్, ఆర్ఎంవో డా.రాథోడ్, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ జి.పార్వతమ్మ, వైద్యాధికారులున్నారు.



విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల్లో 'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో మ్యాథ్స్ ఒలింపియడ్, విద్యార్థి విజ్ఞాన్ మంథన్, డాక్టర్ ఏఎస్‌రావు సైన్స్ టాలెంట్ సెర్చ్, నేషనల్ సైన్స్ ఒలిండియాడ్, అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ తదితర పోటీ పరీక్షలలో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శి కనబరిచారని అన్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులను వారు అభినందించారు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ మనాక్, సైన్స్ ప్రాజెక్టులలో జాతీయ స్థాయికి ఎంపికైన రెజోనెన్స్ శ్రీనగర్ కాలనీ పాఠశాల విద్యార్థులు సీహెచ్ అన్విత్, ఎ చరితలను బుధవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు. సైన్స్ ప్రాజెక్టుల్లో రెండోసారి జాతీయ స్థాయికి ఎంపికకావటం అభినందనీయమని పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. బహుళ అంతస్తుల భవనాలను నిర్మించే కార్మికులకు ఉపయోగపడే విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో విన్నూతన ఆలోచనలతో పరిష్కారం చూపుతూ విద్యార్థులు చేసిన ప్రాజెక్టు ఎంతో ఉపయోగకరమైందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి: సీపీఎం

ఎర్రుపాలెం, జనవరి22(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. మండల కేంద్రంలోని రామిశెట్టి ఫల్లయ్యభవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితాలో పేర్లులేవని అర్హుల ఆందోళనల చెందుతున్నారన్నారు. జాబితాలో పేరు రాని వారు సంక్షేమ పథకాల అమలు నిరంతరం ప్రక్రియ మరలా దరఖాస్తు చేయాలని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, రైతుసంఘం నాయకులు గొల్లపుడి కోటేశ్వరరావు, నల్లమోతు హనుమంతరావు, నాగులవంచ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు



వైరాలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ



మధిరటౌన్‌లో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్



ముష్టికుంట్లలో అధికారులను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేత బంధం నాగేశ్వరరావు



గుండ్రాతిమడుగు గ్రామసభలో ప్రజలు కూల్చిన టెంట్

నిరసనలు..ఆందోళనలు..

వైరా, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అందించే నాలుగు సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే లబ్ధిచేకూర్చేలా ఉన్నాయని ఆపార్టీ వారే లబ్ధిదారులా అంటూ బుధవారం జరిగిన గ్రామసభల్లో జనం అధికారులను నిలదీశారు. రెబ్బవరం గ్రామంలో వెయ్యిమంది ఉపాధి హామీ పనులకు వెళ్తే కేవలం 160మందిని మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఎంపిక చేయటాన్ని అక్కడి ప్రజలు ప్రశ్నించారు. ముసలిమడుగులో 160మంది రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోగా కేవలం 46మందికి మాత్రమే కార్డు లు మంజూరు కావటాన్ని నిలదీశారు. అదే గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 406మంది దరఖాస్తు చేయగా కేవలం 178మందిని మాత్ర మే అర్హుల జాబితాలో ప్రకటించటాన్ని నిలదీశారు. వైరా మునిసిపాలిటీ 11వ వార్డు సోమవరంలో సభను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించి పరిశీలించారు. రెబ్బవరంలో మం డల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, వైరాలో మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ చింతా వేణు, పాల్గొన్నారు.

వేంసూరులో...

వేంసూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడసర్లపాడు, కందుకూరు, దుద్దుపూడి, కొండెగట్ల, జయలక్ష్మీపురం, చౌడారం తండా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రంజిత్‌కుమార్ మాట్లాడారు. తహసీల్దార్ ఎంఏ.రాజు, ఆర్‌ఐలు చిరంజీవి, శ్రీనివాసరావు, ఏవో రామ్మోహన్‌రావు, ఎంఈవో సీహెచ్.వెంకటేశ్వరరావు, పీఆర్ ఏఈ సాయి, తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండలో..

ముదిగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టకూరు, ముత్తారం, పండ్రేగుపల్లి, సువర్ణాపురం, వల్లభి, గోకినపల్లి, వనంవారిక్రిష్ణాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో డీపీవో ఆశాలత, తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, మం డల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంపీవో కిషోర్, ఏవో వేణు, ఏపీవో రంగనాయకమ్మ, ఎంఈవో రమణయ్య, ఏపీఎం కల్పన పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్...

సత్తుపల్లిరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అనర్హులను జాబితాలో చేర్చాలంటూ గ్రామస్థులు ఆందోళన చేసిన సంఘటన మండలంలోని రేగళ్లపాడు గ్రామసభలో చోటుచేసుకుంది. పట్టణంలోని పలు వార్డు సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ హాజరై లబ్ధిదారులకు పథకాలు అమలు చేయించేందుకు ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. కాగా మండలంలో 2399మందిని నాలుగు పథకాలకు సంబంధించి దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో ఆర్‌సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు.

కొణిజర్లలో...

కొణిజర్ల, జనవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. గుండ్రాతిమగుడు గ్రామసభలో టెంటు కూలింది. అధికారులు జాబితా చదువుతుండగా అర్హుల పేర్లు ఏవని, మొత్తం అనర్హులను గుర్తించారని ఆవేదన వ్యక్తం చేస్తూ టెంట్‌ను కూల్చారు.

తల్లాడలో...

తల్లాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో బుధవారం 8గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. ప్రత్యేక అధికారులు వి.శ్రీనివాసరావు, ఎండీ.తాజుద్దీన్, శ్రీనివాసరెడ్డి, ఎన్.దామోదర్‌ప్రసాద్, ఎం.చంద్రమౌళి, అయేషా, శ్రీదేవి, సింధు పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల, ఆళ్లపాడు, తూటికుంట్ల, కలకోట, నారాయణపురం, కలకోట, మోటమర్రి, సీతానగరం గ్రామాలలో బుధవారం గ్రామసభలను నిర్వహించారు. ముష్టికుంట్ల గ్రామంలో బీఆర్ఎస్ కార్మిక సంఘ మండల అధ్యక్షుడు బంధం నాగేశ్వరరావు గ్రామసభలో ప్రకటించిన లబ్ధిదారుల జాబితా సక్రమంగా లేదని మండి పడ్డారు. అర్హులను ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. ఆయా గ్రామ సభల్లో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఆర్.రమాదేవి, ఎంపీవో శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.



రేగళ్లపాడులో అధికారులను నిలదీస్తున్న మాజీ సర్పంచ్ వడ్డంగి విజయ

చింతకానిలో...

చింతకాని, జనవరి 22(ఆంధ్రజ్యోతి): చింతకాని మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభల్లో రసాభసా నెలకొంది. లచ్చగూడెం గ్రామంలో రైతుభరోసా జాబితా నుండి తమ పేర్లను తొలగించారని నిరసన వ్యక్తం చేశారు.

ఏన్కూర్‌లో...

ఏన్కూరు, జనవరి22(ఆంధ్రజ్యోతి): సంక్షేమపథకాల ఎంపిక కోసం నిర్వహించే గ్రామసభలు ఆందోళన మధ్య జరిగాయి. బుధవారం పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి సాయినాథ్, మండల అభివృద్ధి అధికారి రమేష్, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీవో నారాయణ, ఏవో నరసింహారావు, ఏఈవో లహరి పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో...

ఎర్రుపాలెం, జనవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సభలు నిరసనల మధ్య కొనసాగాయి. ఎర్రుపాలెం గ్రామంలో మహిళలు అధికారులపై ఆగ్రహించారు. బీమవరం గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడలకు రేషన్‌కార్డులు మంజూరవడంతో గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఉషా శారద, ఎంపీడీవో బి.సురేందర్, ఎంపీవో శ్రీలక్ష్మి, ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో..

మధిరటౌన్, జనవరి22(ఆంధ్రజ్యోతి): వార్డు సభలో తెలిపిన జాబితాలో తమ పేర్లు లేవని ఎవరూ బాధపడవలసిన పనిలేదని మధిర మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ తెలియజేశారు. బుధవారం మధిర మునిసిపాలిటీలో జరిగిన వార్డు సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్‌కుమార్, ఆయా వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మధిరరూరల్‌లో...

మధిరరూరల్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఓ మైనర్ బాలిక అనాథ కావడంతో అధికారులు మానవతా దృక్పథంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. కాగా బుధవారం జరిగిన గ్రామసభలో మైనర్ అనే విషయాన్ని స్థానికులు లేవనెత్తడంతో చివరకు అధికారులు విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుపోయి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మధిర రూరల్ మండలం ఆత్కూర్ గ్రామ పంచాయతీకి చెందిన పదవ తరగతి చదువుతున్న కృష్ణ స్వరూప తండ్రి జమలయ్య 13 ఏళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి వేరే వివాహం చేసుకుని వెళ్లిపోగా, బాలిక అమ్మమ్మ చెంతనే ఆమెకు చెందిన రేకుల ఇంట్లో నివసిస్తుంది. బాలిక స్వరూప ప్రజాపరిపాలనలో తనకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయమని దరఖాస్తు చేసుకుంది. ఇటీవల జరిగిన అర్హుల జాబితా విచారణలో అధికారులకు బాలిక తనగోడు చెప్పుకుని తన అమ్మమ్మకు కూడా క్యాన్సర్‌తో బాధపడుతుందని తెలపగా అధికారులు బాలికకు మానవతా దృక్పథంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి విషయాన్ని గ్రామసభలో చదివి వినిపించగా బాలిక మైనర్ అని తెలిపారు.

నిరసనలు... ఆందోళనలు

(3వ పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకున్న శ్రీనుకు ఈవిషయం తెలియడంతో గ్రామంలో పంచాయతీ పెట్టాడు. దీంతో గ్రామంలో అందరు ఆ శ్రీనివాస్ పేరుమీద ఇందిరమ్మ ఇల్లు తీసుకుని నీకు డబ్బులు ఇప్పిస్తామని తెలిపారు. అయితే తనకు న్యాయం జరగుగుతుందో లేదోనన్న ఆందోళనతో గురువారం గ్రామసభ ఉన్న నేపథ్యంలో బుధవారం సెల్‌టవర్ ఎక్కాడు.

తల్లిదండ్రులు లేని బాలికకు మానవతా దృక్పథంతో ఇల్లు కేటాయించారు. మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన బాలిక ఒకరు తల్లిదండ్రులు చనిపోవడంతో అమ్మమ్మవద్ద ఉంటున్నది. అమ్మమ్మ కూడా వృద్ధాప్యంతో పాటు అనారోగ్యంతో ఉన్నందున బాలిక దీనస్థితి చూసి ఆమె పేరును ఇందిరమ్మ ఇల్లు జాబితాలో చేర్చారు. అధికారులు మానవతా దృక్పథంతో కేటాయించగా, సోషల్‌మీడియాలో కొందరు ట్రోల్‌చేయడంతో ఆ ఇల్లు రద్దుచేస్తామని అధికారులు పేర్కొన్నారు. జాబితాలో పేర్లు లేకపోవడంతో కాంగ్రెస్‌లోని రెండువర్గాల కార్యకర్తలు కొట్టుకున్నారు. కావాలని చేశారంటూ జాబితాలో పేర్లులేని వారు ఆగ్రహించి వేదిక పక్కన ఉన్న మరోవర్గం నాయకులపై దాడికి దిగారు. దీంతో పోలీసులు సర్దిచెప్పారు.

కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగులో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు , ఇందిరమ్మ ఆత్మీయభరోసాలో పేర్లులేవని కొందరు దరఖాస్తు దారులు నిరసనకు దిగారు. గ్రామసభ నిర్వాహణ కోసం అధికారులు వేసిన టెంటు పడేశారు. దీంతో అధికారులు తిరిగి దరఖాస్తులు ఇవ్వాలని కోరడంతో నిరసనదారులు శాంతించి దరఖాస్తులు అందించారు. పడిపోయిన టెంటు మరలా వేసి గ్రామసభ నిర్వహించారు.

'గందరగోళాన్ని సృష్టిస్తున్న జాబితాలు'

పెనుబల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అధికారుల సర్వే అనంతరం ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో ఎంతోమంది అర్హులైన వారి పేర్లు లేకపోవడం గందరగోళానికి గురిచేస్తుందని సీపీఎం జిల్లా నాయకుడు చలమాల విఠల్‌రావు, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకుడు కాటినేని శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, మాస్‌లైన్ జిల్లా నాయకులు బీరెల్లి లాజర్, తడికమళ్ల చిరంజీవి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు

బోనకల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిచేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎండ్‌హెచ్‌వో బెజవాడ సైదులు సూచించారు. బోనకల్ పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, సీహెచ్‌వో శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం వితరణ

తల్లాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. పదోతరగతి ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల వరకు ప్రతిరోజూ అల్పాహారం పంపిణీకిగానూ ఆర్థికసహాయాన్ని పీడీజీ శివప్రసాద్, బాలయ్య చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జీఎల్‌టీ కోఆర్డినేటర్ దారా శ్రీనివాసరావు, కర్నాటి లక్ష్మారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు బెల్లంకొండ ఆంజనేయులు, కటికి వెంకటేశ్వర్లు(కేవీ), శీలం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికతో విద్యనభ్యసించాలి

● ఆధ్యాత్మికవేత్త భమిడిపాటి రవికృష్ణశర్మ

కల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికతో విద్యనభ్యసించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, పండితుడు భమిడిపాటి రవికృష్ణశర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పేరువంచ ఉన్నత పాఠశాలలో విద్యలో రాణిచేలా అనుసరించాల్సిన మెలకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తాను ఇదే పాఠశాలలో పూర్వ విద్యార్థి అని చెప్పుకున్నారు. పదవ తరగతిలో 10/10 సాధించిన వారికి ఉచితంగా తన సొంత ఖర్చులతో విమానం ఎక్కించి బెంగళూరు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమలో ఎంఈఓ నివేదిత, ఉపాధ్యాయులు ఎండి మౌలాలి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ హెల్త్ అసిస్టెంట్ మృతి



రవికుమార్

సత్తుపల్లిరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ఓ హెల్త్ అసిస్టెంట్ చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానిక హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న సత్తెనపల్లి రవికుమార్ (45) పెనుబల్లి మండలం లంకాసాగర్ పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మూడు రోజుల క్రితం ఇంట్లో క్రిమిసంహారక మందు సేవించిన రవికుమార్‌ను బంధువులు చికిత్స నిమిత్తం ఏలూరు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఎస్‌ఐ రఘు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉండగా, మృతుని స్వగ్రామం తల్లాడ మండలం రామచంద్రాపురానికి బంధువులు తరలించారు.

కారును ఢీకొట్టిన లారీ...

సత్తుపల్లిరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న కారును లారీ ఢీకొట్టిన ప్రమాదం సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుబల్లి మండలం నీలాద్రి నుంచి సత్తుపల్లికి కారులో ముగ్గురు ప్రయాణిస్తుండగా రాజమండ్రి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఎయిర్‌బెలూన్స్ ఓపెన్ అవ్వడంతో ముగ్గురుకి ప్రాణాపాయం తప్పగా, వాహనం ఎదుట భాగం పూర్తిగా దెబ్బతింది. స్వల్పగాయాలతో బయటపడగా పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

కొణిజర్లలో..

కొణిజర్ల, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఖాళీ గ్యాస్ సిలిండర్ల ట్రాలీ ఆటోను లారీ ఢీకొట్టిన సంఘటన మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ సూరజ్ తెలిపినవ వివరాల ప్రకారం.. ఖమ్మం వైపు నుంచి వైరా వైపు వెళ్తున్న లారీ, తనికెళ్ల దగ్గర కొణిజర్ల నుంచి ఖమ్మం వెళ్తున్న ఖాళీ గ్యాస్ సిలిండర్‌ల ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ నాగేంద్రబాబుకు స్వల్పగాయాలయ్యాయి. కాగా ఢీకొట్టిన లారీ ఆగకుండ వెళ్తుండగా ఎస్‌ఐ సూరజ్, సిబ్బంది విషయం తెలుసుకొని వెంబడించి లారీని పట్టుకున్నారు. జరిగిన ప్రమాదంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

ముదిగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పమ్మి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం టిప్పర్ ప్రమాదవశాత్తూ అదుపుతప్పి బోల్తాపడింది. ముదిగొండ నుంచి వల్లభి వైపు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ బ్రేక్ వేయడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

'బోనకల్ సొసైటీలో యూరియా కొరత లేదు'

బోనకల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బోనకల్ సొసైటీలో యూరియా కొరత లేదని సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు తెలిపారు. బోనకల్, చిరునోముల రెండు గ్రామాలకు సంబంధించి సొసైటీలో ప్రస్తుతం 890 బస్తాల యూరియా స్టాకు ఉందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎరువులను సకాలంలో తెప్పిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలందిస్తున్నామని పేర్కొన్నారు.

ఆరోగ్య విషయాలపై అవగాహన

ఏన్కూరు, జనవరి22(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరెంపుల సతీష్ కళాబృందం బుధవారం కేసుపల్లి, హిమాంనగర్ గ్రామాల్లో ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు ఆట పాటల ద్వారా చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాములు, సీహెచ్‌వోడీ శివరాజు, ఎంపీహెచ్‌వో లలితకుమారి, అరుణకుమారి, ఏఎన్ఎం శారద తదితరులు పాల్గొన్నారు.

వైరా జీజేసీలో రాగిజావ పంపిణీ

వైరా, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఆకళాశాల ప్రిన్సిపల్ ఎల్. నవీనజ్యోతి ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాధవరావుతో కలిసి ప్రారంభించారు. ఖమ్మంజిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీఐఈవో రవిబాబు ఇచ్చిన ఆదేశాలతో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

గ్రామసభల్లో స్వచ్ఛందంగా నిలదీస్తున్న ప్రజలు

» బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సత్తుపల్లిరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని ప్రజలే స్వచ్ఛందంగా నిలదీస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీ పాలకవర్గం ఈనెల 27వ తేదీతో ముగియనుండంతో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో చైర్మన్ కూసంపూడి మహేష్ తన పాలకవర్గం సభ్యులు (బీఆర్ఎస్ కౌన్సిలర్లు)తో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని కేటీఆర్ శాలువాతో సన్మానించారు. తెలంగాణ రాష్ట్రం రాకమునుపు రూ.50లక్షల నిధులు ఇచ్చే పరిస్థితి లేదని, రాష్ట్రం సాధించుకున్న తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రిగా నిధులు సమకూర్చి పట్టణాలు, పల్లెలను అభివృద్ధి చేసేందుకు అవకాశమిచ్చారన్నారు. ఈ ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై ప్రజలకు అసంతృప్తి ఉందని, భవిష్యత్ మనదేనని, అప్పటివరకు విశ్రమించకుండా ప్రజా సమస్యలపై పోరాడుదామని కేటీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, నాయకులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో పాటు మునిసిపల్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సత్తుపల్లి పాలకవర్గాన్ని సన్మానిస్తున్న కేటీఆర్

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

వైరా, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం సుంకర సుధాకర్ అధ్యక్షతన బోడేపూడి భవన్‌లో జరిగిన సీపీఎం వైరా డివిజన్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 13నెలలవుతున్నా నేడు గ్రామసభలు పెట్టి సంక్షేమ పథకాలు అందకుండా అనేక కొర్రీలు వేస్తుందని విమర్శించారు. ఈనెల 25నుంచి 28వతేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలకు భారీగా తరలిరావాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్, డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, మచ్చా మణి, కె.నరేంద్ర, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, బాణోతు బాలాజీ, వజ్జా రామారావు, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, తాతా పద్మ, కొండబోయిన ఉమావతి, బోయినపల్లి శ్రీనివాసరావు, ఏర్పుల రాములు పాల్గొన్నారు.

'రేగళ్లపాడు నర్సరీలో అక్రమాలపై విచారణ జరపాలి'

సత్తుపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రేగళ్లపాడు నర్సరీలో అక్రమాలపై విచారణ జరపాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ పామ్ గ్రోయర్స్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి సీవై.పుల్లయ్య డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక ఆయిల్‌ఫెడ్ ఆఫీస్‌లో విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. తంబా రకానికి చెందిన సుమారు 3లక్షల మొక్కలను ఒక బ్యాచ్‌లో పెంచగా, హాఫ్‌టైప్ మొక్కలుగా మిగిలిపోయాయని, ఇప్పటివరకు ఎక్కడెక్కడ పంపిణీ చేశారో నష్టపోయిన రైతులు అందరినీ ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు చెలికాని సూరిబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, మోరంపూడి శ్రీనివాసరావు, రావుల రాజబాబు, పుచ్చకాయల సోమిరెడ్డి, దొడ్డా చక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు అధికారులకే ఇవ్వాలి

వేంసూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అధికారులకే ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మట్టా ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పర్సా రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం మర్లపాడులో జరిగిన బీజేపీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుతో ఈ పథకం తప్పుదారి పట్టే అవకాశముందన్నారు. బాలకృష్ణారెడ్డి, మాదిరాజు శ్రీనివాసరావు, తుంబూరు చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మట్టా ప్రసాద్

'ఇందిర డెయిరీ మధిర ప్రాంత మహిళలకు వరం'

మధిరరూరల్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఇందిర డెయిరీ మధిర ప్రాంత మహిళలకు వరం లాంటిదని వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి పథకాన్ని తెలుసుకోవడానికి వచ్చిన అధికారులు తెలిపారు. బుధవారం మధిర లోని ఐకేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పథకం విశిష్టతను ఇక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనపరచడంతో శరవేగంగా పనులు జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల డీఆర్‌డీఏ అధికారులు సుధీర్, దాసు, అనిల్‌కుమార్, శ్రీకాంత్, సరిత, ఇందిరా డైరీ ఏపీఎం లక్ష్మణరావు, ఇందిరా డైరీ అధ్యక్షురాలు అన్నపూర్ణ తదితరులున్నారు.



మాట్లాడుతున్న అధికారులు

సాగర్‌జలాలను విడుదల చేయాలని వినతి

తల్లాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ సిరిపురం మేజర్ కాల్వకు సాగర్‌జలాలు విడుదల చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కల్యాణపు కృష్ణయ్య, నల్లమోతు మోహన్‌రావు, నాయకులు సాయిన్ని ప్రకాశరావు, ఐనాల రామలింగేశ్వరరావు, కృష్ణయ్య, కర్లకంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటారెడ్డికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కోటారెడ్డి

మధిర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు యరమల కోటారెడ్డికి నాగార్జున యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పట్టా లభించింది. తెలుగు సాహిత్యంలో చావా శివకోటి కథలు-సమగ్ర పరిశీలన అనే అంశంపై ఆచార్య నారిశెట్టి వెంకట కృష్ణారావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను యూనివర్శిటీ ఈ పట్టాను ప్రదానం చేసింది. ఈసందర్భంగా కోటారెడ్డిని పాఠశాల హెచ్ఎం భీమరాజు, పలువురు అభినందించారు.

అంకితభావంతో పని చేయండి...

(3వ పేజీ తరువాయి)

వచ్చే వాహనాల పార్కింగ్, హాస్పిటల్ ప్రధాన గేట్, బయట వాహనాల రద్దీ నియంత్రణ, ప్రధాన మార్గం ఆర్బీ నిర్మాణాలపై కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆస్పత్రికి కావాల్సిన వైద్య పరికరాలు, సౌకర్యాల గురించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. రోగులకు అందించే భోజనం రుచికరంగా, పౌష్టికాహారంతో అందించాలని ఆయన అధికారులకు సూచించారు. టూ వీలర్ పార్కింగ్ నిర్వహణపై పరిశీలించారు. పార్కింగ్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

విభాగాలు తెలిసేలా బోర్డులు..

ఆస్పత్రికి వచ్చిన రోగుల వైద్యం కోసం వెతుకులాడుకోకుండా ఏ విభాగం ఎక్కడ ఉంటుందో తెలిసేలా ప్రత్యేకంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. టాయిలెట్ మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. ఆస్పత్రిలోని క్రిటికల్ కేర్ భవనం వైపు, పరిపాలన భవనం వైపున సీసీ రోడ్లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రిలోని ప్రధాన ద్వారం వద్ద రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏ విభాగం ఎక్కడుందని విషయంపై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి రోగుల సహాయకులకు తెలపాలని అన్నారు. ఆస్పత్రికి 10 ఏసీలు, రేడియాలజీ పోస్టులు వెంటనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రి నుంచి మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.కిరణ్, ఆర్ఎంవో డా.రాథోడ్, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ జి.పార్వతమ్మ, వైద్యాధికారులున్నారు.



ఆస్పత్రి పార్కింగ్‌ను పరిశీలించి సూచనలు ఇస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ